RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 226 మేడ్చల్ మల్కాజ్‌గిరి 7 సెప్టెంబర్ 2024 శనివారం పేజీలు : 4

## దేశంలో 5 కోట్ల పెండింగ్ కేసులు

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ఉన్న కోర్టుల్లో 5 కోట్లకుపైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ విషయాన్ని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఓ లిఖితపూర్వక సమాధానం ద్వారా లోక్‌సభకు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 1.18 కోట్ల కేసులు, సుప్రీంకోర్టులో 84,045 కేసులు, వివిధ హైకోర్టుల్లో 60,11,678 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. తగినన్ని మౌలిక వసతులు, తగినంత మంది సిబ్బంది లేకపోవడం కూడా ఇందుకు కారణాలని తెలిపారు. సంక్లిష్టమైన అంశాల కారణంగా మరికొన్ని పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. నిబంధనలను కచ్చితంగా అమలు పరచడం వల్ల కూడా ఇంకొన్ని పెండింగ్‌లో ఉంటున్నాయని తెలిపారు.





## తెలుగు రాష్ట్రాలకు పీఎం మోదీ బిగ్ రిలీఫ్

# భారీ సాయం..!!

## తక్షణ సహాయం 3,300 కోట్లు ప్రకటించిన కేంద్రం

హైదరాబాద్ / అమరావతి : భారీ వర్షాలతో నష్టపోయిన ఏపీ, తెలంగాణకు కేంద్రం భారీ సాయం ప్రకటించింది. గత వారం రోజులుగా రెండు రాష్ట్రాల్లోనూ వరదలు పలు ప్రాంతాలను ముంచెత్తా యి. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వరదల ప్రభావం...నష్టం పైన ప్రధాని మోదీకి లేఖ రాసారు. ఈ వరదలకు జాతీయ విపత్తుగా ప్రకటించాలని కోరారు. తక్షణ సాయం ప్రకటించి ఆదుకోవాలని కోరారు. దీంతో, కేంద్ర విపత్తు టీంలను తెలుగు రాష్ట్రాలకు పంపారు. ఇదే సమయంలో కేంద్రం ఈ భారీ మొత్తంగా సాయంగా ప్రకటించింది.

**కేంద్ర సాయం...** ఏపీలోని విజయవాడ, తెలంగాణలోని ఖమ్మం ప్రాంతాలను వరద ముంచెత్తింది. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తమ రాష్ట్రాల్లోని వరద పరిస్థితి...నష్టం పైన వివరిస్తూ ప్రధానికి లేఖ రాసారు. తెలంగాణలో దాదాపుగా రూ 5,400 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా గుర్తించారు.

ఈ వివరాలను రేవంత్ కేంద్రానికి నివేదించారు. తెలంగాణలో పర్యటించాలని ప్రధాని మోదీని కోరారు.రాష్ట్రంలో వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని అభ్యర్ధించారు. తెలంగాణ కోసం తక్షణ సాయం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

**సీఎంల అభ్యర్ధన...** అదే విధంగా ఏపీ సీఎం చంద్రబాబు సైతం ప్రధాని, కేంద్ర హెూం మంత్రి అమిత్ షా తో మాట్లాడారు. ఏపీలో వచ్చిన వరదల గురించి వివరించారు. భారీగా పంటనష్టం జరిగిందని..సామాన్య ప్రజలు భారీగా నష్టపోయారని వివరించారు. కేంద్రం నుంచి ప్రత్యేకంగా టీంలు పంపాలని..తక్షణ సాయం ప్రకటించాలని అభ్యర్ధించారు. చంద్రబాబు అభ్యర్ధనకు కేంద్ర హెూం మంత్రి అమిత్ షా స్పందించారు.

హెూం శాఖతో పాటుగా డిజాస్టర్ శాఖ అధికారులతో ఒక టీంను ఏపీకి పంపారు. అదే విధంగా కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రెండు రాష్ట్రాలోనూ పర్యటించారు.

**రూ 3,300 కోట్ల ఖరారు...** కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ముందుగా ఏపీలో పర్యటించి పరిస్థితులను అధ్యయనం చేసారు. భారీగా నష్టం జరిగిందని...కేంద్రం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ రోజు ఉదయం తెలంగాణలో ఏరియల్ సర్వే నిర్వహించారు. సీఎం రేవంత్ తోనూ భేటీ అయ్యారు. ప్రాథమిక నష్టం అంచనాలను రేవంత్ వివరించారు. కేంద్రం రెండు తెలుగు రాష్ట్రాలకు అండగా ఉంటుందని శివరాజ్ సింగ్ చౌహాన్ హామీ ఇచ్చారు. ఇదే సమయంలో కేంద్రం రెండు తెలుగు రాష్ట్రాలకు సాయంగా రూ 3,300 కోట్లను విడుదల చేస్తున్నట్లు రెండు ప్రభుత్వాలకు సమాచారం ఇచ్చింది.




## తెలంగాణ పీసీసీ చీఫ్ గా మహేశ్ కుమార్ గౌడ్




హైదరాబాద్ : తెలంగాణ పీసీసీ చీఫ్ గా మహేశ్ కుమార్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన నాటి నుంచి కొత్త పీసీసీ చీఫ్ పై చర్చ మొదలైంది. పీసీసీ చీఫ్ గా ఉన్న రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత.. కొత్త వారికి ఛాన్స్ ఇవ్వాలని హైకమాండ్ భావించింది. అయితే.. ఈలోగా పార్లమెంట్ ఎన్నికలు రావడంతో రేవంత్ ను కొనసాగించింది. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తర్వాత కొత్త పీసీసీ చీఫ్ కోసం అధిష్టానం కసరత్తు ప్రారంభించింది. సీఎంగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన రేవంత్ ఉండడంతో.. బీసీలకు ఛాన్స్ పక్కా అన్న ప్రచారం సాగింది. ఈ నేపథ్యంలో ఈ పదవి కోసం సీనియర్ నేత మధుయాష్కీ గౌడ్, మహేశ్ కుమార్ గౌడ్ మధ్య తీవ్రంగా పోటీ పడ్డారు.

అయితే.. రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్ర మార్క, మాజీ పీసీసీ చీఫ్, మంత్రి ఉత్తమ్ కు సన్నిహితుడైన మహేశ్ కుమార్ గౌడ్ వైపే హైకమాండ్ మొగ్గు చూపింది. గత ఎన్నికల్లో పార్టీ ఆదేశాలతో పోటీ నుంచి తప్పుకుని వేరే వారికి అవకాశం ఇవ్వడం, ప్రస్తుతం వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉండడం, వివాదరహితుడిగా పేరుండడం ఆయనకు కలిసొచ్చినట్లు తెలుస్తోంది. మరో ఒకటి రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

## వినాయకచవితి తర్వాత

# సమరమే..!

## మళ్లీ రంగంలోకి కేసీఆర్..!!




హైదరాబాద్ : బీఆర్ఎస్ బాస్ కేసీఆర్ క్షేత్రస్థాయి పర్యటనలకు సిద్ధమవుతున్నారట. ఎన్నికల్లో ఓటమి అనంతరం... హామీల అమలుకు ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలని భావించిన గులాబీదళాధిపతి... ఆ హనీమూన్ పీరియడ్ ముగిసిందని... ఇక ప్రజల తరఫున ప్రభుత్వంతో యుద్ధం చేయాలని నిర్ణయించుకున్నారని సమాచారం. కాంగ్రెస్ ఎన్నికల హామీల్లో ప్రధానమైన రైతురుణమాఫీ సరిగా జరగలేదని భావిస్తున్న బీఆర్ఎస్%ా% అధినేత రైతు యాత్రకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

**ప్రజాక్షేత్రంలో యాక్టివ్ అవ్వాలని డిసైడ్..** అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఎక్కువగా ఎర్రవెల్లి ఫాం హౌస్‌కే పరిమితమవుతున్న మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్... ఇక ప్రజాక్షేత్రంలో యాక్టివ్ అవ్వాలని డిసైడ్ అయినట్లు సమాచారం. రైతు రుణమాఫీలో చాలా మంది అర్హులకు న్యాయం జరగలేదని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో రైతుల తరఫున ప్రభుత్వంతో పోరాడేందుకు రైతు యాత్ర చేపట్టాలని గులాబీ దళపతి నిర్ణయించినట్లు బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తర్వాత పూర్తిగా రాజకీయ కార్యక్రమాలకు దూరమైన కేసీఆర్.. ఇటీవల తనను కలిసిన ఎమ్మెల్యేలతో రైతు యాత్ర కోసం ప్రస్తావించినట్లు తెలుస్తోంది.

**వినాయకచవితి తర్వాత క్షేత్రస్థాయి పర్యటనలకు..** అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీ హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ... ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి 9 నెలలు అవుతున్నా, చాలా హామీలను అమలు చేయలేదని విమర్శిస్తోంది బీఆర్ఎస్. హామీల అమలుకు ఆర్నెల్లు సమయం ఇవ్వాలని భావించిన గులాబీదళం.... అనుకున్న సమయం కన్నా ప్రభుత్వానికి మూడు నెలలు ఎక్కువ గడువు ఇచ్చినట్లు చెబుతోంది. తొమ్మిది నెలలు అయినా చాలా హామీలను అమలు చేయలేదని, చేశామని చెబుతున్న రైతు రుణమాఫీ కూడా సక్రమంగా అందలేదని బీఆర్ఎస్ ఆరోపణ. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నిర్ణయించిన బీఆర్ఎస్ అధినేత.. వినాయకచవితి తర్వాత క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లాలని డిసైడ్ అయినట్లు చెబుతున్నారు.

**తాను రంగంలోకి దిగడం ద్వారా వలసలకు బ్రేక్ వేయాలని భావన..** ఇన్నాళ్లు హామీలు అమలు చేయకపోవడమే కాకుండా, తమ పార్టీ ఎమ్మెల్యేలకు గాలం వేస్తున్న కాంగ్రెస్ పార్టీని దీటుగా ఎదుర్కొవడంపై దృష్టిపెట్టిన కేసీఆర్.. తాను రంగంలోకి దిగడం ద్వారా వలసలకు బ్రేక్ వేయాలని భావిస్తున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికే 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరగా, మరికొందరు ఎమ్మెల్యేలు హస్తం కండువా కప్పుకునేందుకు ఆసక్తి చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఐతే కేసీఆర్ మళ్లీ రంగంలోకి దిగితే పరిస్థితులు మారే అవకాశం ఉన్నందున ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని కొందరు ఎమ్మెల్యేలు పునరాలోచనలో పడినట్లు చెబుతున్నారు.

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు అనర్హత వేటు భయం..** కేసీఆర్ మళ్లీ యాక్టివ్ అయితే పార్టీ పుంజుకునే అవకాశం ఉందని, అదే సమయంలో అనుకున్న సంఖ్యలో వలసలు లేకపోతే అనర్హత వేటు పడే ప్రమాదాన్ని ఎదుర్కొవాల్సి వస్తుందని కొందరు ఎమ్మెల్యేలు భయపడుతున్నట్లు చెబుతున్నారు. కేసీఆర్ కూడా తనను కలిసిన ఎమ్మెల్యేలతో వలస వెళ్లిన వారిపై అనర్హత వేటు వేయించడంతోపాటు కాంగ్రెస్ హామీలపై ఆరా తీస్తున్నట్లు చెబుతున్నారు.

జంపింగ్ ఎమ్మెల్యేలపై వేటు వేయడమే టార్గెట్‌గా పెట్టుకున్న బీఆర్ఎస్. పార్టీ అధినేత రంగంలోకి దిగిన తర్వాత అనర్హత వేటు ప్రక్రియను మరింత వేగవంతం చేసేలా పావులు కదుపుతోందంటున్నారు.

**స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి పునర్ వైభవం తెచ్చేందుకు కార్యాచరణ..** అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఎక్కువగా ఫాం హౌస్‌లో ఉంటున్న మాజీ సీఎం కేసీఆర్... తనను కలిసేందుకు వచ్చిన కార్యకర్తలు, నాయకులకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ వ్యతిరేకత పెరుగుతోందని తాజాగా అంచనాకు వచ్చిన కేసీఆర్ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి పునర్ వైభవం తెచ్చేందుకు ఇప్పటి నుంచే తగిన కార్యాచరణకు సిద్ధమవుతున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం రైతు రుణమాఫీపై అసంతృప్తి ఎక్కువగా ఉన్నట్లు బీఆర్ఎస్ అంచనా వేస్తోంది.

**కేసీఆర్ రంగంలోకి దిగితే స్థానిక ఎన్నికల్లో అడ్వాంటేజ్ అయ్యే ఛాన్స్..** రకరకాల నిబంధనలు విధించడం వల్ల.. 30 వేల కోట్లకుపైగా అవుతుందని అంచనా వేసిన రైతు రుణమాఫీ కేవలం 17 వేల కోట్లతో సరిపెట్టిందని ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఆరోపణలు గుప్పిస్తోంది. ఈ విషయమై కృష్ణార్జునులు హరీశ్ రావు, కేటీఆర్ ఇప్పటికే ఫైట్ చేస్తున్నారు. ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేసి, ప్రభుత్వాన్ని ఒత్తిడికి గురిచేయాలని భావిస్తోంది బీఆర్ఎస్. ఇందుకోసం నేరుగా అధినేత రంగంలోకి దిగితే స్థానిక ఎన్నికల్లో అడ్వాంటేజ్ అయ్యే అవకాశం ఉందని ఊహిస్తోంది. కేసీఆర్ కూడా తగిన సమయం వరకు వేచి చూద్దామని ఇన్నాళ్లు ఆగారని.. ఇప్పుడు సమయం ఆసన్నమైనందున సమర శంఖం పూరించాలని డిసైడ్ అయినట్లు చెబుతున్నారు. వినాయక చవితి తర్వాత ఎప్పుడైనా, రైతు యాత్రలు ప్రారంభించేలా ప్లాన్ చేయాలని పార్టీ యంత్రాంగాన్ని ఆదేశించినట్లు చెబుతున్నారు.

# సంపాదకీయం

## గుండెబరువెక్కే సీన్లు.. కన్నీళ్లు తెప్పించే సన్నివేశాలు.. విజయవాడ వరద కష్టాలు

గుండెబరువెక్కే సీన్లు.. కన్నీళ్లు తెప్పించే సన్నివేశాలు.. విజయవాడ వరద కష్టాలు భారీ వర్షాలతో బెజవాడ వణికిపోయింది. వచ్చిన వరదలతో నగరం మొత్తం ఆగమైంది. సిటీ పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుపోయింది. చరిత్రలో ఎన్నడూ లేనంతగా వర్షం కురియడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఇళ్లు, రోడ్లు కనిపించలేనంతగా ముంచెత్తడంతో అంతటా భయానక దృశ్యాలు కనిపించాయి. మరికొన్ని కన్నీరు తెప్పించే దృశ్యాలు ఆవిష్కృతం అయ్యాయి. విజయవాడలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. అకస్మాత్తుగా వచ్చిన వరదలతో ఇళ్లు, కాలనీలు పూర్తిగా నీట మునిగాయి. ఇప్పటికే వర్షాలతో, వరదలతో అల్లాడిపోయిన నగరంలో ఇప్పుడు మరోసారి వర్షం పడుతోంది. నిన్న అర్ధరాత్రి నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తోంది. దీంతో మరోసారి ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తమపై వరుణుడు మరోసారి పగబట్టినట్టుగా చేస్తున్నాడని ఆవేదన చెందుతున్నారు. ఇదిలా ఉండగా.. మొన్నటి వరదల బారి నుంచి నగరం కొంచెం కొంచెం తేరుకుంటోంది. మొన్నటి వరదలకు చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. మరికొంత మంది వరదల్లోనే తప్పిపోయారు. ఈ ఘటనలు చాలా వరకు విషాదంలో ముంచాయి. అందులోనూ.. కొన్ని విషాదాలు అయితే హృదయాలను పిండేసేలా కనిపించాయి. మొన్న తన చిన్నారిని కాపాడుకునేందుకు ఓ తండ్రి తన బిడ్డను ప్లాస్టిక్ డబ్బాలో తరలించే దృశ్యాన్ని చూశాం. తాజాగా అలాంటి కలిచివేసే దృశ్యమే ఒకటి వైరల్ అయింది. ఆ ఫొటోను చూసిన వారంతా 'దేవుడా.. ఏమిటీ ఈ దుస్థితి' అంటూ రోదిస్తున్నారు. చిట్టినగర్ పరిధిలోని 14 ఏళ్ల బాలుడు అదృశ్యమై నీటిలో శవమై తేలాడు. అయితే.. మృతదేహాన్ని అదే వరదలో నడుములోతు నీటిలో తీసుకెళ్తున్న దృశ్యం అందరినీ కలిచివేసింది. కొడుకు మృతదేహాన్ని తరలిస్తుండగా ఆ తల్లి రోదించిన తీరు కంటతడి పెట్టించింది.

## వినాయక నవరాత్రి ఉత్సవాల్లో కీలక ఘట్టం నిమజ్జనానికి వినాయక చవితి నుండే పకడ్బందీ ప్రణాళిక...




### మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతం



జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : ఈనెల 7వ తేదిన వినాయక చవితి పండుగ, 17న వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకొని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లాలోని 17 చెరువులలో నిమజ్జన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, చెరువుల దగ్గర జిల్లా యంత్రాంగానికి అనుసంధానంగా ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం ఒక ప్రకటనలో తెలిపారు నోడల్ అధికారులు తమ పరిధిలోని వినాయక మండపాల దగ్గర ఏలాంటి ప్రమాదాలు జరుగకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ తెలిపారు. పండగ మొదలు మూడువ రోజు నుండే వినాయకుల నిమజ్జన కార్యక్రమం మొదలవుతుందని, ప్రతి ట్యాంక్‌కు నియమించబడిన ప్రత్యేక అధికారులు ఈ విషయంలో తక్షణ చర్యలు తీసుకోవాలని మరియు పోలీసు, %GHMC%, ఎలక్ట్రికల్, %R&B%, అగ్నిమాపక, వంటి సంబంధిత శాఖల సమన్వయంతో గణేష్ విగ్రహాల నిమజ్జనాన్ని శాంతియుతంగా మరియు సాఫీగా పూర్తి చేసేలా చూడాలని ఆదేశించారు. ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్, %RWS/HMWS%, రవాణా, నీటిపారుదల, మత్స్య, రెవెన్యూ. అవసరమైన చర్యలు తీసుకోవాలని మరియు కేంద్ర/ రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు జారీ చేసే సూచనల మేరకు అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. మున్సిపల్ కమీషనర్లు, తహాసీల్దార్లు తమ పరిధిలోని చెరువులే కాకుండా ఇతర కుంటలు, చెరువుల పర్యవేక్షించాలని అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. 1సుతారి చెరువు మేడ్చల్ శ్రీమతి వసంత లక్ష్మి MPDO మేడ్చల్ 9849903330 2. పెద్ద చెరువు మేడ్చల్ శ్రీ.నాగి రెడ్డి MC మేడ్చల్ 7032898999 3. ప్రగతి నగర్ ట్యాంక్ బాచుపల్లి శ్రీమతి సౌజన్య %MC% నిజాంపేట్ 7729003999 4. నల్ల చెరువు ఉప్పల్ శ్రీ. జి. ఆంజనేయులు డిప్యూ కమిషనర్ ఉప్పల్ 8008103667 5 వెన్నెలగడ్డ చెరువు కుత్బుల్లాపూర్ శ్రీ.వై.నర్సింహ కమిషనర్ కుత్బుల్లాపూర్ 9989930159 6 పరికి చెరువు కుత్బుల్లాపూర్ ఎల్.పి.మల్లయ్యకు డీ కమిషనర్ గాజులరామారం 6309529286 7. IDL ట్యాంక్ R/S IDL ట్యాంక్ L/S కూకట్‌పల్లి శ్రీ టి.శ్యామ్ ప్రకాష్ ఆర్ డి ఓ, మల్కాజ్గిరి డివిజన్ 7995073753 8 హస్మత్పేట్ బోవెన్ చెరువు బాలానగర్ శ్రీ కృష్ణయ్య కూకట్‌పల్లి డిప్యూ కమిషనర్ 7337557245 9. సున్నం చెరువు కూకట్‌పల్లి శ్రీ. జె స్వామి తహశీల్దార్ కూకట్‌పల్లి 7995073755 10. శామీర్‌పేట సరస్సు శామీర్‌పేట ఆర్.మమతా బాయి శామీర్‌పేట ఎంపీడీఓ 9849903332 11. సఫిల్‌గూడ ట్యాంక్ మల్కాజిగిరి శ్రీ. మల్కాజిగిరి డీ కమిషనర్ జి రాజు 7331189762 9154899636 12. కొత్త చెరువు అల్వాల్ శ్రీ. వి శ్రీనివాస్ రెడ్డి డి. కమీషనర్ అల్వాల్ 8985409173 13. సూరారం చెర్వు (లింగం) కుత్బుల్లాపూర్ శ్రీ. ఎ రెహమాన్ ఖాన్ తహశీల్దార్ కుత్బుల్లాపూర్ 7995073757 14. ఎదులాబాద్ ట్యాంక్ ఘట్కేసర్ Md .షబీర్ అలీ MC ఘట్కేసర్ P.వేమన్ రెడ్డి MC పోచారం 9154083769 9154812771 15. కాప్రా చెరువు కాప్రా శ్రీ ముకుంద్ రెడ్డి డి. కమీషనర్ కాప్రా 9000113021 16. రాంపల్లి చెరువు కీసర శ్రీ. రాజేంద్ర కుమార్ ఎంసీ నాగారం 7075596119 17. చెర్లపల్లి చెరువు కాప్రా Sm.సుచరిత, తహశీల్దార్ కాప్రా మండల 7995073748

పైన పేర్కొన్న మునిసిపల్ కమీషనర్లు మరియు తహశీల్దార్లందరూ తమ అధికార పరిధిలోని అన్ని ఇతర ట్యాంకులు/ చెరువుల సంరక్షణను చూసుకోవాలి. అయితే ప్రజల శాంతి భద్రతల నిమిత్తం నిమజ్జనం కోసం సంబంధిత శాఖల వారు వారి వారి సిబ్బందితో, అవసరమైన పరికరాలను సక్రమంగా మోహరించి ప్రాథమిక కనీస ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు.

## ఇంట్లోనే మట్టి, ఎండు వరితో వినాయక విగ్రహాన్ని తయారు చేసుకొని పదిమందికి ఆదర్శంగా నిలుస్తున్న యువకుడు

శామీర్ పేట, (గరుడ వార్త) : తన ఇంట్లోనే మట్టి, ఎండు వరితో వినాయక విగ్రహాన్ని తయారు చేసుకుని పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతూ, మరోవైపు ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాల కొరకు ఇంట్లోనే గణపతి విగ్రహం తయారు చేసుకొని వినాయక చవితి రోజు పూజలు నిర్వహించుకోవడానికి శుక్రవారం సిద్ధం చేసుకున్నాడు. శామీర్ పేట మండలం తుంకుంట మున్సిపల్ పరిధిలోని ఉప్పరపల్లికి చెందిన యువకుడు తన నివాసంలోనే కర్రలు, ఎండు గడ్డితో సుమారు 5 అడుగుల గణపతి విగ్రహాన్ని తయారు చేసుకుని దానిని మట్టి తో తీర్చిదిద్దుకొని రంగులద్దాడు. ప్రతి ఏడు ఇలానే గణేష్ విగ్రహాన్ని సిద్ధం చేసుకుని పూజలు చేసి నిమజ్జనం గావించడం జరుగుతుందని, తన సొంత పరిజ్ఞానంతో విగ్రహాన్ని సిద్ధం చేసుకోని పూజలు చేయడం ఆనందదాయకమని తోటి మిత్రులు సంతోషం వ్యక్తం చేశారు.

# నిర్మాణాలకు నిధులెలా?



సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ గ్రామీణ మండలం బొల్లారంలో మూలవాగుపై రూ.4.17 కోట్లతో చెక్‌డ్యాం నిర్మించారు. 80 శాతం పనులు పూర్తయ్యాయి. గుత్తేదారుకు రూ.3.18 కోట్ల వరకు చెల్లింపులు జరిగాయి. గతేడాది సెప్టెంబరులో వర్షాలకు వాగుకు ఉన్న బండ్‌కట్ట నుంచి వరదనీటి ప్రవాహం పెరిగి సమీపంలోని గృహాలకు ముంపు పొంచి ఉందని కాంక్రీటు కట్టను డిటోనేటర్లతో పేల్చివేశారు. ప్రస్తుతం చెక్‌డ్యాంలో చుక్క నీరు లేదు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గట్టెపల్లిలో రూ.4 కోట్ల చెక్‌డ్యాం నిర్మాణం పునాది దశలోనే ఉంది. పనులు దక్కించుకున్న గుత్తేదారు అగ్రిమెంటు చేసుకున్న ఏడాదికి పనులు చేసేందుకు ముందుకొచ్చారు. పునాది పనులు చేశాక సిమెంటు, కాంక్రీటు ధరలు పెరగడం.. అంచనాకు మించిన భారమని మధ్యలోనే పనులు వదిలేశారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ వాగులపై 2020లో 114 చెక్‌డ్యాంల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపారు. రెండు విడతల్లో 72 మంజూరు చేశారు. రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల పరిధిలోని 52 చెక్‌డ్యాంల నిర్మాణాలు ప్రారంభం కాగా చాలా వరకు పూర్తి కాలేదు. జగిత్యాల జిల్లాలో జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల్లో అయిదు చెక్‌డ్యాంల పనులు మాత్రమే ప్రారంభం కాగా అవి కూడా అసంపూర్తి దశలోనే ఉన్నాయి. ఇటీవల హైదరాబాద్‌లో నీటిపారుదలశాఖ సమీక్షలో రాష్ట్రంలో చెక్‌డ్యాం నిర్మాణ ప్రగతి.. వాటికి వెచ్చించిన నిధులపై ఈఎన్‌సీలతో సమావేశం జరిగింది. వచ్చే వర్షాకాలానికి పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. మూడేళ్లుగా పనులు నత్తనడకన సాగుతుండగా.. కొన్ని నిర్మాణాలు మధ్యలో ఉండగానే వరదలకు కొట్టుకుపోయాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మూలవాగుపై బొల్లారం వద్ద నిర్మించిన చెక్ డ్యాం ముంపుపై అంచనా లేకపోవడంతో వరద పెరిగి పేల్చి వేయాల్సి వచ్చింది. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో జిల్లాస్థాయి ఉన్నతాధికారుల సమీక్షలో పభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. కొట్టుకుపోయిన చోట అక్కడి స్థానిక పరిస్థితులపై అధ్యయనం చేసి నమూనాల్లో మార్పులు చేయాలని సూచించారు.

వైఫల్యాలపై దృష్టి : ఉమ్మడి జిల్లాలో చెక్‌డ్యాంల నిర్మాణాలకు గత ప్రభుత్వం వందల కోట్ల రూపాయలు వ్యయం చేసింది. ఇంత భారీ మొత్తం ఖర్చుచేసినా.. మొదటి నుంచి నిర్మాణాలపై నీటిపారుదలశాఖ అధికారులు నిశిత దృష్టి సారించలేదనే ఆరోపణలున్నాయి. ఒక్కో చెక్‌డ్యాంకు కనిష్ఠంగా రూ.50 లక్షల నుంచి గరిష్ఠంగా రూ.20 కోట్ల వరకు వెచ్చించారు. భారీ వర్షాలకు ఏటా కొన్ని చెక్‌డ్యాంలు కొట్టుకుపోయి పొలాలు కోతకు గురై రైతులు నష్టపోయారు. దాదాపు రెండేళ్ల కిందట రాష్ట్ర ఉన్నతాధికారుల బృందం వరదలకు కొట్టుకుపోయిన చెక్‌డ్యాంలను పరిశీలించినప్పుడు అన్ని వాగులపై నిర్మించిన చెక్ డ్యాంలన్నింటికీ ఒకే నమూనా ఉందని.. వరద ప్రవాహ వేగాన్ని.. మట్టి నమూనాలు సేకరించకుండా నిర్మాణాలు చేపట్టడంతోనే కొట్టుకుపోతున్నాయని తేల్చింది. వీటన్నింటిని పునర్ అంచనాలతో పనులు చేయాలని సూచించింది. ఇదే విషయమై నీటిపారుదలశాఖ ఇంజినీర్లు గుత్తేదారులతో సమావేశం నిర్వహించగా ఆర్థిక భారమని వారు పనులు చేయడానికి ముందుకు రాలేదు. చేసిన పనులకు డబ్బులు చెల్లించడంతోపాటు.. పునర్ అంచనాలకు అదనపు డబ్బులు చెల్లిస్తేనే పనులు చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికి ఈ విషయమై ఎలాంటి సూచనలు రాలేదు. మరోవైపు పనులు పూర్తి చేసేందుకు అయిదు నెలల సమయం మాత్రమే ఉంది. ఈ విషయమై కరీంనగర్ డివిజన్ ఈఎన్‌సీ శంకర్‌తో మాట్లాడగా అసంపూర్తి దశలో కొట్టుకుపోయినా సరే అగ్రిమెంటు ప్రకారం మొత్తం పనులు చేయాల్సిన బాధ్యత గుత్తేదారుపైనే ఉంటుందన్నారు. ఇప్పటికే చాలా వాటికి గడువులు పొడిగిస్తూ వచ్చామని, జూన్ 30లోగా అన్ని చెక్‌డ్యాంలు పూర్తి చేయాలని అన్నారు. నాబార్డు నిధులతో చేపట్టేవి మాత్రం మార్చి 31వరకే గడువు అని తెలిపారు. అయిదు నెలల్లో పనులు పూర్తి చేయాలని అధికారులు పేర్కొంటుండగా గుత్తేదారులు మాత్రం దెబ్బతిన్న చెక్‌డ్యాంలకు సంబంధించి బిల్లులు ఇవ్వడంతోపాటు పునర్ అంచనాలకు నిధులు ఇవ్వాలని స్పష్టం చేయడంతో రాష్ట్రంలోని కొత్త ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది నీటిపారుదలశాఖలో చర్చ జరుగుతోంది.

## తప్పిపోయిన బాలుడిని గంటలోపే ఛేదించిన శామీర్ పేట పోలీసులు

శామీర్ పేట, (గరుడ వార్త) : తప్పిపోయిన బాలుడిని గంటలోపే శామీర్ పేట పోలీసులు ఛేదించారు. శుక్రవారం శామీర్ పేట క్రిస్టిన్ ఆశ్రమం నుంచి సుమారు 10 సంవత్సరాల వయస్సు ఉన్న ఒక బాలుడు కనిపించడంలేదని శామీర్ పేట పోలీసు స్టేషన్‌కి సమాచారం అందింది. ఈ సమాచారాన్ని అందుకున్న వెంటనే, మూడు బృందాలను ఏర్పాటు చేసి వెతకడం ప్రారంభించారు. ఒక గంటలోపే పెట్రోలింగ్ సిబ్బంది బాలుడిని విజయవంతంగా కనుగొన్నారు. అతన్ని ఆశ్రమ అధికారులకు సురక్షితంగా అప్పగించారు.



ఈ శోధనలో పోలీసులు చురుకుగా పాల్గొని అత్యంత వేగంగా ఘటనాస్థలికి చేరుకుని బాలుడిని కనుగొన్నారు.

ఈ విషయం తెలిసిన పోలీసు ఉన్నతాధికారులు మిస్సింగ్ బాలుడి తక్షణ ఆచూకీ కోసం చేసిన వేగవంతమైన, సమర్థవంతమైన చర్యల కోసం సంబంధిత పోలీసు అధికారుల కృషిని అభినందించినట్లు శామీర్ పేట ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ తెలిపారు.

## విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు ఎంతో కీలకం..

శామీర్ పేట, (గరుడ వార్త) : విద్యార్థులను భావితరాలకు బాటలు వేసే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర వహిస్తారని శామీర్ పేట ఎంపీడీవో మమతాబాయి అన్నారు. ఉమ్మడి శామీర్ పేట మండలం లోని వివిధ పాఠశాలలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులను ఎంఈఓ వసంత కుమారి ఆధ్వర్యంలో సన్మానించారు. శామీర్ పేట మండలం, తూముకుంట మున్సిపల్ , మూడు చింతలపల్లి మండలం లోని వివిధ పాఠశాలల్లో ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. వీరితో పాటు జిల్లాలో ఉత్తమ అవార్డు పొందిన ఉపాధ్యాయులను సైతం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీ ఎస్ యు టీ ఎఫ్ శామీర్



పేట మండల అధ్యక్షుడు తిరుమలేశ్, టీ పీ ఆర్ టీ యు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి, పీ ఆర్ టీ యు టీ ఎస్ మండల అధ్యక్షుడు మహేష్, మూడు చింతల పల్లి మండల , పీ ఆర్ టీ యు టీ ఎస్ అధ్యక్షుడు రాజిరెడ్డి, శామీర్ పేట టీ యు టీ ఎఫ్ అధ్యక్షుడు రాజు, మూడు చింతల పల్లి టీ యు టీ ఎఫ్ అధ్యక్షుడు మోహన్ బాబు, భాను ప్రకాష్,, రవీంద్ర చారి, ప్రధానోపాధ్యాయులు గోపాల్, కమలాకర్, భాగ్యమని, సుబ్బారావు, వివిధ పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన... మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతం...



జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : వినాయక చవితి పండుగను పురస్కరించుకొని జిల్లా ప్రజలకు మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. మండపాల వద్ద కరెంట్, లైటింగ్ వంటి వైర్ల దగ్గర జాగ్రత్తగా ఉంటూ ఏలాంటి ప్రమాదాలు జరుగకుండా చూసుకోవాలని వినాయక మండపాల నిర్వాహకులకు ప్రజలకు కలెక్టర్ సూచించారు. పండుగను భక్తి శ్రద్ధలతో ఆనందంగా జరుపుకోవాలని కలెక్టరు ఆకాంక్షించారు..

# ఇళ్లలోకి వరద.. బాధితుల కన్నీరు

గంగాధర: గంగాధర మండలం మధురానగర్‌లోని 9వ వార్డులో అయిదేళ్లుగా వర్షాకాలంలో వరదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఇళ్ల సమీపంలోనే ఉన్న కుడి కాలువ తెగి వరద ఇళ్లలోకి, వీధుల్లోకి చేరుతుండగా ఆందోళనకు గురవుతున్నారు. ఏటా ఇబ్బందులు పడుతున్నా సాగునీటి పారుదల శాఖ అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది శాశ్వత పరిష్కారం చూపడం లేదని ఆవేదన చెందారు. ఇళ్లకు సమీపంలోనే నారాయణపూర్ జలాశయం నుంచి వేములవాడకు కుడికాలువ నిర్మించి అసంపూర్తిగా వదిలేశారు. వర్షాలు కురిసిన ప్రతిసారి దగ్గర్లోనే ఉన్న వంటశాల గుట్ట నుంచి వరద వచ్చి కుడికాలువలో చేరుతుంది. అసంపూర్తి కాలువలో నీటి నిల్వ పెరిగి కట్ట తెగడంతో నీరంతా ఇళ్లలోకి, దారుల్లోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 50 ఇళ్లలోకి వరద చేరి సరుకులు తడిసిముద్దవుతున్నాయని వాపోయారు.

వర్షాలు తగ్గుముఖం పట్టినా వరద మాత్రం ఇప్పటికీ ప్రవహిస్తుందని మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. పాములు, తేళ్లు, విషకీటకాలతో భయంభయంగా గడుపుతున్నామని తెలిపారు. కాలువలోని బండరాళు తొలగించి సమస్య పరిష్కరించాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని మాజీ సర్పంచి వేముల లావణ్య తెలిపారు. ఎంపీడీవో జనార్దన్‌రెడ్డిని స్థానికులు కలిసి సమస్య పరిష్కరించాలని మొర పెట్టుకున్నారు. అధికారులు స్పందించి కాలువ నీరు ఇళ్లలోకి




రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఏటా ఇబ్బందులు...అయిదేళ్లుగా వర్షాకాలంలో ఇళ్లలోకి నీరు వచ్చి చేరుతుంది. సరకులన్నీ తడిసిముద్దవుతున్నాయి. పరిసరాలు అపరిశుభ్రంగా మారి దోమలు వృద్ధి చెందుతున్నాయి. జ్వరాల బారిన పడుతున్నాం. వీధుల్లో నడిచివెళ్లాలంటే పిల్లలు, వృద్ధులు జంకుతున్నారు.
మానస

అధికారులు పట్టించుకోవడం లేదు

నాలుగు రోజులైనా వరద ప్రవహిస్తూనే ఉంది. మురుగునీటి కాలువలు లేక వీధుల్లోకి, ఇళ్లలోకి చేరుతుంది. కాలువ అసంపూర్తిగా వదిలేయడంతో కట్ట తెగి నీరు ప్రవహిస్తోంది. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా దాటవేస్తున్నారు. తప్ప సమస్య పరిష్కరించడం లేదు.
మల్లేశం

ముంపు సమస్యకు పరిష్కారం ఎలా?

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో ఏటా వర్షాకాలంలో కొన్ని ప్రాంతాలు నీట మునుగుతున్నాయి. ఏళ్ల తరబడి ఈ సమస్య నెలకొని ఉండగా శాఖల మధ్య సమన్వయ లోపం, నిధుల కొరత కారణంగా నగరవాసులు అవస్థలు పడుతున్నారు. నగరవ్యాప్తంగా ఏడు ప్రాంతాల్లో నీరు నిలుస్తోందని బల్దియా ఇంజినీరింగ్ విభాగం అధికారులు గుర్తించి కమిషనర్‌కు నివేదిక ఇచ్చినట్లు సమాచారం. ప్రధానంగా హౌసింగ్‌బోర్డుకాలనీ, ఎన్టీఆర్ విగ్రహం కూడలి, ఆర్టీసీ వర్క్‌షాఫ్, రాంనగర్, ముకరంపుర ఏరోప్లేన్ వీధి, శ్రీనగర్‌కాలనీ, హుస్సేనీపుర తదితర ప్రాంతాలు ఉన్నాయి. హౌసింగ్‌బోర్డుకాలనీలో రెండేళ్లుగా కొన్ని ఇళ్లలోకి వరద వస్తోంది. ఎగువ నుంచి వచ్చే వరద వెనక్కి వస్తుండటంతో ఆ ప్రాంతవాసులు ఇబ్బందులు పడుతున్నారు. రామగుండం బైపాసు రోడ్డులో బొమ్మకల్ పంచాయతీ పరిధిలో ప్రధాన రహదారిపై మూడు కల్వర్టులు ఉన్నాయి. వీటిని మూసివేయడంతో నీరంతా నిలిచిపోతోంది. వీటిని తెరిచి వరదను మానేరులో కలిసేలా చర్యలు చేపడితే తప్ప ఫలితం ఉండదు.

# నష్టం అంచనా

జగిత్యాల: జిల్లాలో కురిసిన వర్షాల కారణంగా జరిగిన నష్టాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు 38.40 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు దెబ్బతినగా రెండు పక్కా ఇళ్లు పాక్షికంగా.. 3 కచ్చా ఇళ్లు పూర్తిగా.. 34 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఒక పశువు మృతి చెందగా 6 కిలోమీటర్ల మేర రహదారులు.. 2 వంతెనలు.. 4 కల్వర్టులు.. 5 ట్యాంకులు దెబ్బతిన్నాయి. వరద బాధితుల కోసం 14 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయగా 585 మందిని తరలించారు. జగిత్యాల మండలం చల్‌గల్ పెద్దచెరువు, కల్లెడ పోచమ్మకుంట, తుమ్మలకుంటకు బుంగలు పడగా తాత్కాలికంగా మరమ్మతులు చేశారు.

తాత్కాలిక మరమ్మతులపై దృష్టి

సారంగాపూర్ మండలం అర్పపల్లి డి-53 కాలువ డ్రాప్ గోడ పడిపోగా జగిత్యాల మండలం వెల్దుర్తితో కాలువకు బుంగపడింది. బీమారం



మండలం ఒడ్యాడ్ హెూల్‌కమ్మకుంట, పసునూరు ఊరకుంట దెబ్బతిన్నాయి. వాటి మరమ్మతుల కోసం రూ.1.12 కోట్లు అంచనా వేశారు. కాగా పెగడపల్లి మండలం మద్దులపల్లి, పందులగుట్ట రహదారిపై కల్వర్టులు దెబ్బతినగా, కథలాపూర్ మండలం తుర్తి - రుద్రంగి రహదారి, కల్వర్టులకు గండ్లు పడ్డాయి. రాయికల్ మండలం ఆదర్శ పాఠశాల రహదారితోపాటు కొడిమ్యాల మండలం సూరంపేట రహదారిపై కల్వర్టుకు గండి పడింది. మేడిపల్లి మండలం కొండాపూర్-ఒడ్యాడ్ రహదారిపైజ.. ఎండపల్లి మండలం కొత్తపేట ఎస్సీ కాలనీ.. కొడిమ్యాల మండలం కోనాపూర్ రహదారి.. సూరంపేట గంగారాం తండా రహదారిపై.. కథలాపూర్ మండలం పోతారం తండా రహదారిపై కల్వర్టులు తెగిపోయాయి. జగిత్యాల మండలం గుల్లపేట శ్మశానవాటికకు వెళ్లే రహదారిపై గండి పడింది. మల్లాపూర్ మండలం మొగిలిపేట రహదారిపై కల్వర్టు తెగిపోయింది. తాత్కాలిక మరమ్మతులకు రూ.11.5 లక్షలు అవసరమని అధికారులు గుర్తించారు.

# భూదాన్ భూములు.. మింగేస్తున్నారు!



పెద్దేముల్: ప్రభుత్వ నిబంధనల ప్రకారం 'భూదాన్ భూములు' అమ్మకూడదు, కొనకూడదు. కానీ కొందరు అక్రమార్కులు అవేమీ పట్టించుకోవడం లేదు. గిరిజనులకు ప్రభుత్వం పంచిన భూములను కారుచౌకగా కొనుగోలు చేస్తున్నారు. ఎకరం రూ.80,000 చొప్పున ధర నిర్ణయించి ముందుగా కొంత ముట్టజెప్పుతున్నారు. రైతుల వద్ద ఒప్పందాలు చేసుకుని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. రెవెన్యూ యంత్రాంగం మాత్రం అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. పెద్దేముల్ మండల కేంద్రంలో 'చాపకింద నీరులా' సాగుతున్న ఈ తతంగం గురించి ఉన్నతాధికారులు పట్టించుకోక పోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. దీనికి సంబంధించి కథనం.

**మొత్తం 75.19 ఎకరాలు**

మండల కేంద్రం పెద్దేముల్ గ్రామ రెవెన్యూ శివారులో మొత్తం 75.19 ఎకరాల విస్తీర్ణంలో భూదాన్ భూములున్నాయి. 1954 వరకు పట్టా భూములుగా ఉన్నాయి. 1958లో కొందరు స్థానిక భూస్వాములు ప్రభుత్వానికి దానం చేశారు. వాటినే 'భూదాన్ భూములుగా' పేర్కొంటూ ఎలాంటి భూమి లేని గిరిజనులకు ప్రభుత్వం పంచి పెట్టింది.

**6.22 ఎకరాలకు అక్రమంగా పట్టాలు**

భూదాన్ చట్టం 1965 ప్రకారం కేటాయించిన వ్యక్తి సాగు కోసం భూమిని ఉపయోగించాలి. ఎలాంటి లావాదేవీలు చేయకూడదు. అయినా రైతులతో ఒప్పందాలు చేసుకున్న స్థిరాస్తి వ్యాపారులు భూములను ఆక్రమించారు. ధరణి పోర్టల్ రాకముందే కొంత మంది గిరిజనుల భూములు అక్రమంగా పట్టా అయ్యాయి. 2014లో 6.22 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో పేరు మార్పిడి చేసుకుని పట్టా భూమిగా మార్చుకున్నారు. తర్వాత ధరణి రావడంతో మిగిలిన రైతుల భూముల్లో మార్పు జరగలేదు. 2015లో ప్రభుత్వం భూదాన్ బోర్డును రద్దు చేసింది. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి ఈ భూములకు ప్రత్యేక అధికారిగా కొనసాగుతున్నారు.

**లీజుల పేరుతో ఒప్పందాలు**

సాగుకు అనువుగా లేవని కొందరు గిరిజనులు పడావుగా వదిలేశారు. ఇదే అదనుగా నగరానికి చెందిన వ్యాపారులు మధ్యవర్తుల ద్వారా భూముల కొనుగోళ్లు చేపట్టారు. 2014లో ఈ తంతుకు శ్రీకారం చుడితే ఇటీవలి కాలంలో అక్రమ మార్గంలో కొందరి భూములను పట్టాగా మార్చుకుని మార్పిడి చేసుకుంటున్నారు. రైతులకు డబ్బులు చెల్లించిన కొందరు వ్యాపారులు తమ పేరు మీద భూములు పట్టా కావని తెలిసి 99 సంవత్సరాల పాటు లీజుకు ఇచ్చినట్లు రైతులతో రాయించుకుంటున్నారు. పాత ఒప్పందాలను పక్కన బెట్టి కొత్తగా లీజుకు తీసుకుంటున్నట్లు ఒప్పందాలు చేసుకుంటున్నారు.

**విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం**

కిషన్, తహసీల్దార్, పెద్దేముల్

భూదాన్ భూములు అమ్మడం, కొనడం చట్టరీత్యా నేరం. అవి ప్రభుత్వ భూములు. 2022 నుంచి నిషేధిత జాబితాలో ఉన్నాయి. లావాదేవీలు జరిపితే చర్యలు తీసుకుంటాం. పట్టా మార్పిడి జరిగిన భూములపై క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

# పార్కుల స్థలాలు మాయం!




హైదరాబాద్: గతంలో హెచ్ఎండీఏ పరిధిలో అనుమతించిన లేఅవుట్లలో పార్కులు, ఇతర ప్రజాఅవసరాలకు కేటాయించిన స్థలాల మాయంపై ప్రస్తుతం చర్చ నడుస్తోంది. చెరువులకు ఉన్న ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలోని అక్రమ కట్టడాలను హైడ్రా అధికారులు కూల్చివేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఆక్రమణలకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకునే అవకాశముండటంతో అధికార యంత్రాంగంలో దడ మొదలైంది. తర్వాత పార్కుల్లో ఉన్న అక్రమ నిర్మాణాలపై హైడ్రా దృష్టిసారించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. గతంలో లేఅవుట్లలో పార్కులు, ఆట స్థలాలు ఇతర ప్రజా అవసరాలకు కేటాయించిన స్థలాలను సైతం దొంగ సర్వేనంబర్లతో కొందరు కబ్జాచేశారు. వాటిని కొనుగోలు చేసినట్లు డాక్యుమెంట్లు సృష్టించి అక్కడ భారీగా నిర్మాణాలు చేపట్టారు. కొందరు షెడ్లు వేసి తమ అధీనంలో పెట్టుకున్నారు. ఫంక్షన్ హాళ్లు లాంటివి నిర్మించి అద్దెకు ఇచ్చి అక్రమంగా సంపాదిస్తున్నారు. అవుటర్ రింగ్ రోడ్డు పరిధిలోని పలు పెద్దపెద్ద వెంచర్లకు గతంలో హెచ్ఎండీఏ అనుమతులు జారీ చేసింది. తర్వాత కాలంలో అక్కడ స్థలాలకు భారీ ఎత్తున ధరలు వచ్చాయి. కొన్ని చోట్ల చదరపు గజం రూ.లక్షపైనే పలుకుతోంది. (నార్సింగ్, నానక్‌రాంగూడ, మణికొండ ప్రాంతాల్లో కొన్ని లేఅవుట్లలో పార్కుల కోసం విడిచిపెట్టిన భూములను ఆయా లేఅవుట్లలోని నేతలే తప్పుడు డ్యాక్యుమెంట్లతో మింగేసినట్లు ఆరోపణలున్నాయి.)

జరుగుతోంది ఇలా..

చాలా లేఅవుట్లలో పార్కులు, ఆట స్థలాలను నామమాత్రంగా చూపుతూ సరిపెడుతున్నారు. అక్కడితో ఆగకుండా ప్రజా అవసరాలకు కేటాయించిన 10 శాతం భూమిపై దృష్టిపెడుతున్నారు. 4-5 శాతం స్థలం వదిలి మిగతా భూమిని ఏదోలా మళ్లీ సొంతం చేసుకుంటున్నారు. లేఅవుట్లలో ప్లాట్లు కొన్నవారికి అవగాహన లేకపోవడం, దీనిపై సరైన సమాచారం లేక ఇలాంటి అక్రమాలపై ప్రశ్నించే వారు కనిపించకపోవడంతో వారు ఆడిందే ఆటగా పాడిందే పాటగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో పార్కులు, ఆట స్థలాల కబ్జాపై అతి త్వరలో హైడ్రా దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది. చెరువుల్లో కబ్జాల తొలగింపు తర్వాత పార్కుల ఆక్రమణలపై కొరడా ఝుళిపించే అవకాశం ఉంది. ఈ లోపు ఆక్రమణలపై పూర్తి సమాచారం సేకరిస్తున్నట్లు హెచ్ఎండీఏకు చెందిన ఓ అధికారి తెలిపారు.

ఇదీ పద్ధతి..లేఅవుట్లు వేసే సందర్భంలో అన్ని వైపులా అంతర్గత రహదారులు నిర్మించాలి. ప్రధాన రహదారికి వీటిని అనుసంధానం చేయాలి. ఉద్యానాలు, ఆట స్థలాలు, పచ్చదనం పెంపొందించేందుకు కూడా లేఅవుట్లలో 10 శాతం స్థలం విడిచిపెట్టాలి. లేఅవుట్ అభివృద్ధి చేసే సమయంలో ఇక్కడ పార్కులు, ఆట స్థలాలను తీర్చిదిద్దాలి. అప్పుడే తుది లేఅవుట్ అనుమతులను హెచ్ఎండీఏ జారీ చేస్తుంది. అప్పటివరకు తన తనఖాలో ఉంచుకుంటుంది.

# వ్యాధుల ముప్పు.. ముందే మేల్కొంటే మేలు


సిరిసిల్ల : భారీ వర్షాల కారణంగా జిల్లా కేంద్రంలో పలు ప్రాంతాలను వరద ముంచెత్తింది. దీంతో పారిశుద్ధ్య సమస్య నెలకొంది. మరోవైపు అంతర్గత రహదారులపై బురద నిలిచింది. వెంటనే పరిశుభ్రతకు చర్యలు చేపట్టకపోతే వ్యాధులు ప్రబలే అవకాశం లేకపోలేదు. ఆ దిశగా పురపాలక యంత్రాంగం కదలాల్సిన అవసరం ఉంది.

సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్, శ్రీనగర్ కాలనీల్లో అంతర్గత రహదారులు వరదలకు కొట్టుకుపోయాయి. శాంతినగర్ నుంచి శ్రీనగర్‌కు వచ్చే రోడ్డు పక్కనే వరద నిలిచి కాలనీవాసులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. నీటిలో నుంచే కాలనీవాసులు రాకపోకలు సాగిస్తున్నారు. మురుగులో నడవడం వల్ల కాళ్లు చెడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో మురుగు నిలిచి దుర్వాసన వస్తోంది.

అంతర్గత వీధుల్లో కాలువలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో వర్షాలు వస్తే మురుగంతా రహదారులపై నుంచే పారుతోంది.

వార్డుల్లో కాలువలను శుభ్రం చేయాలని, ప్రధాన కాలువల వెంట బ్లీచింగ్ పౌడర్ చల్లాలని పురపాలక సంఘం అధికారులకు స్థానికులు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో వ్యాధులు వ్యాపించడం సాధారణమే అయినప్పటికీ దీనికి ప్రధాన కారణం పారిశుద్ధ్య లోపం. కాలువలు నిండి వ్యర్థాలు రోడ్లపైకి చేరడంతోపాటు చెత్తాచెదారం కుళ్లిపోయి ఈగలు, దోమలు వృద్ధి చెందుతాయి. ఇవే వ్యాధులకు ప్రధాన కారణమవుతాయి. అధికారుల నిర్లక్ష్యం వల్ల చెత్తాచెదారం ఎక్కడికక్కడే పేరుకుపోతోంది. ఎప్పటికప్పుడు కాలువలను శుభ్రం చేయిస్తే ఈ సమస్య ఉండదు. అధికారులు స్పందించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. అలాగే అంతర్గత రహదారులపై నిలిచిన బురదను తొలగించాలని శాంతినగర్, శ్రీనగర్ కాలనీవాసులు కోరుతున్నారు.

చెప్పినా పట్టించుకోవడం లేదు



వర్షాకాలం వచ్చిందంటే చాలు నీరు ఇళ్లలోకి వస్తుంది. ఇళ్ల మధ్యనే మురుగు నిల్వ ఉంటుంది. కాలువలు సరిగ్గా లేకపోవడంతో రహదారులపై నీరు నిలిచి ఇబ్బంది కలుగుతుంది. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు.
తడిగొప్పుల వజ్రవ్వ, శాంతినగర్

నీళ్లలో నుంచి నడిస్తే...

వర్షానికి రోడ్డుపై మురుగు చేరడంతో ఇళ్లలోకి వెళ్లడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. ఇంటికి వెళ్లాలంటే మురుగులో నుంచే వెళ్లాలి. రోజూ రావడం, పోవడం వల్ల కాళ్లు చెడిపోతున్నాయి. మట్టి పోయాలని మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేశాం. వచ్చి చూసి వెళ్లారే తప్ప ఇప్పటి వరకు మట్టి పోయలేదు.
జిందం విజయ

దోమలు వస్తున్నాయి

ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగాయి. వర్షానికి అందులో మురుగు నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోంది. దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయి. నీటిని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లాలి.
చెల్లోజి రమేశ్‌శుభ్రం చేయిస్తాం

సమస్య మా దృష్టికి వచ్చింది. రెండు రోజుల్లో అంతర్గత రోడ్లపై మట్టి పోయిస్తాం. మురుగు కాలువలను శుభ్రం చేయిస్తాం.
సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిరిసిల్ల పురపాలక సంఘం

# వసతి కొరత.. విద్యార్థుల వేదన

నిర్మల్ : జిల్లా ఖానాపూర్‌కు చెందిన స్వాతి.. కరీంనగర్‌లోని ఓ డిగ్రీ కళాశాలలో చేరారు. పోస్ట్‌మెట్రిక్ బీసీ వసతిగృహంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోగా.. ప్రవేశాలు లేవని నిర్వాహకులు చెప్పారు. ఆర్థిక స్తోమత లేకపోవడంతో అందులో చేరేందుకు రెండు వారాలుగా అధికారులకు వినతిపత్రం అందజేస్తున్నారు.

కొత్తపల్లి మండలం ఎలగందల్‌కు చెందిన నిలేశ్ కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఇంటర్‌లో ప్రవేశం పొందాడు. బీసీ వసతిగృహంలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోగా.. వాటిల్లో సీటు లభించడం లేదు. 15 రోజులుగా అంతగా బస్సు సౌకర్యం లేని గ్రామం నుంచి తరగతులకు హాజరయ్యేందుకు ఇబ్బందులు పడుతున్నాడు.

వీరే కాదు.. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు పక్క జిల్లాల నుంచి కరీంనగర్‌లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు వస్తున్న పలువురు విద్యార్థుల దుస్థితి ఇది. అటానమస్ గుర్తింపు పొందిన ఎస్సారార్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలతోపాటు ఇతర వాటిలో ఇక్కడ చదివేందుకు పలు ప్రాంతాల బీసీ విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. వారు కోరుకున్న కళాశాలల్లో సీట్లు సాధిస్తున్నా.. వసతిగృహాల్లో ప్రవేశాలు లేకపోవడంతో ఆవేదన చెందుతున్నారు.

అద్దె భవనాల్లో..కరీంనగర్ జిల్లాలో మొత్తం 11 పోస్టు మెట్రిక్ బీసీ వసతిగృహాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఒక్కోదాంట్లో 150 మందికి మాత్రమే ప్రవేశాలు కల్పిస్తున్నారు. అయినా ఇందులో చేరేందుకు అధిక మంది ఆసక్తి చూపుతన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా, నిర్మల్, ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల విద్యార్థులు సైతం ఇక్కడి కళాశాలల్లో చేరుతున్నారు.

ముందుగా వచ్చిన వారితోనే ప్రవేశాలు పూర్తవుతున్నాయి. మిగిలిన వారు వసతి కోసం సంబంధిత అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మరికొందరు ప్రైవేటు వసతిగృహాలను ఆశ్రయిస్తున్నారు. ఇక్కడి ఒక వసతిగృహానికే 340 మంది బాలికలు దరఖాస్తు పెట్టుకున్నా



రంటే ఎంత ఆవశ్యకత ఉందో అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా దూర ప్రాంతాల నుంచి బాలికలు ఈ పరిస్థితితో తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. భోజన, వసతి లేమి కారణంగా మధ్యలో కళాశాలలను వదిలి వెళ్లలేక.. ఇబ్బందుల మధ్యే చదువు కొనసాగిస్తున్నారు. కరీంనగర్ ఎస్సీ పోస్ట్ మెట్రిక్ బాలుర వసతిగృహాల్లోనూ ఇదే పరిస్థితి.

సమస్యను పరిష్కరించాలి

మారుమూల ప్రాంత పేద విద్యార్థులు కరీంనగర్‌లో చదువుకునేందుకు ఎక్కువగా వస్తున్నారు. ఇక్కడి వసతి గృహాల సంఖ్యను ప్రభుత్వం పెంచని కారణంగా అనేకమంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం వెంటనే స్పందించాలి. కె.శ్రీధర్ రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీసీ సంక్షేమ సంఘంప్రభుత్వానికి విన్నవించాంకళాశాల విద్యార్థులు చేరే వసతిగృహాల్లో ప్రవేశాలు భర్తీ అయ్యాయి. చాలామంది దరఖాస్తు పెట్టుకుంటున్నారు. అదనపు ప్రవేశాల కోసం ప్రభుత్వానికి విన్నవించాం. అనుమతి రాగానే చేరేందుకు అవకాశం కల్పిస్తాం.
అనిల్ ప్రకాశ్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి

# వరదొస్తే.. దారి వెతుక్కోవాల్సిందే

సిరిసిల్ల : జిల్లా వ్యాప్తంగా రెండ్రోజులుగా కురిసిన వర్షాలకు ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్‌శాఖల రహదారులు అధ్వానంగా మారాయి. పలు చోట్ల గుంతలు పడటంతో పాటు కోతకు గురై ప్రమాదకరంగా మారాయి. ఆయా మార్గాల్లో అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని ప్రయాణం చేయాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. జిల్లాలో కోనరావుపేట, ఇల్లంతకుంట, బోయినపల్లి మండలాల్లో దెబ్బతిన్న రహదారుల గుండా ప్రయాణం ఇబ్బందిగా మారడంతో ప్రత్యామ్నాయ మార్గాల్లో పట్టణాలకు వెళ్తున్నారు. రహదారులు మరమ్మతులు చేపట్టడానికి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. సిరిసిల్ల-మరిమడ్ల రహదారిలో లచ్చపేట వద్ద వంతెన ప్రాంతంలో రహదారి కోతకు గురైంది. కోనరావుపేట మండలం మామిడిపల్లి-నిజామాబాద్, నిమ్మపల్లి-వట్టిమల్ల రహదారుల్లో మూలవాగుపై తాత్కాలిక రహదారులు పూర్తిగా కోతకు గురయ్యాయి.




ఆయా మార్గాల్లో వెళ్లే వారు సమీప గ్రామాలు లింగంపల్లి, మంగళపల్లి, సుద్దాల, మారుపాక, నందికమాన్ మీదుగా వేములవాడకు వెళ్తున్నారు.

వేములవాడ మండలం హన్మాజీపేట-బావుసాయిపేట, వేములవాడ-సిరికొండ మార్గాల్లో కాజ్‌వేలు కోతకు గురయ్యాయి. వేములవాడ-కోరుట్ల రహదారిలో చందుర్తి మండలం సనుగుల వద్ద రెండు చోట్ల రహదారి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. వేములవాడ పట్టణ శివారు బీరప్ప ఆలయం సమీపంలో మల్లారం రహదారిలో లోలెవల్ కాజ్‌వే శిథిలావస్థకు చేరింది.

మాచారెడ్డి-ముస్తాబాద్-సిద్దిపేట రహదారిలో కాజ్‌వే ప్రమాదకరంగా ఉంది. పెద్దమ్మస్టేజి - లింగన్నపేట రహదారిలో పైవంతెన నిర్మాణ ప్రాంతంలో తాత్కాలిక రహదారి మానేరు వరద ఉద్ధృతికి నామరూపాల్లేకుండా కొట్టుకుపోయింది. అలాగే ఇల్లంతకుంట మండలం జవారిపేట-నర్సక్కపేట మధ్యలో వరద తాకిడికి కాజ్‌వే పైపులతో సహా కొట్టుకుపోయింది. అధికారులు ఈ మార్గాల్లో రాకపోకలను దారి మళ్లించారు. బోయినపల్లి-వేములవాడ, రుద్రంగి-దసరానాయక్‌తండా, ఇల్లంతకుంట మండలం తాళ్లపల్లి-గూడెం గ్రామాల మధ్య రహదారులు కోతకు గురికావడంతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

## మహా బల్దియా.. ఓఆర్ఆర్ సమీపంలోని 51 గ్రామాలు మున్సిపాలిటీల్లోకి..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిని విస్తరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం తొలి అడుగు వేసింది. బాహ్యవలయ రహదారికి సమీపంలోని 51 గ్రామాలను మున్సిపాలిటీల్లోకి కలుపుతూ ఆర్డినెన్స్ జారీ చేసింది. తరువాత మున్సిపాలిటీలనూ జీహెచ్ఎంసీలో విలీనం చేసి 'మహా' బల్దియాను ఏర్పాటు చేయనున్నారు. బాహ్యవలయ రహదారి లోపల, వెలుపలున్న గ్రామాలను ఎంపిక చేసేందుకు పంచాయతీరాజ్,



మున్సిపల్ అధికారులు కసరత్తు చేశారు. భౌగోళిక సరిహద్దులు, ఆర్థిక వనరులు, మున్సిపాలిటీలు, జీహెచ్ఎంసీతో అనుసంధానం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని నివేదిక రూపొందించారు. దీని ఆధారంగా ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. గ్రామ పంచాయతీల కాలపరిమితి ముగిసింది. జీహెచ్ఎంసీ పాలకమండలి గడువు ఫిబ్రవరి 10, 2026తో ముగియనుంది. అప్పుడు నగరాన్ని ఒకే సంస్థగా కొనసాగించడం లేదా పలు భాగాలుగా విభజించే ప్రక్రియ మొదల వనుందని తెలిపారు.

**పెరగనున్న విస్తీర్ణం..**

ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలోని 150 డివిజన్లు 625చ.కి.మీ విస్తీర్ణం లో ఉన్నాయి. కంటోన్మెంట్ ప్రాంతాన్ని మినహాయించి.. ఓఆర్ఆర్ లోపల ఉన్న అన్ని స్థానిక సంస్థలను బల్దియాలో కలిపితే గ్రేటర్ విస్తీర్ణం 2,053.44చ.కి.మీటర్లకు పెరగనుంది. జనాభా 1.5కోట్లకు చేరుతుం ది. డివిజన్లు 200కు చేరుకునే అవకాశముంది

## హద్దు మీరకుండా.. కత్తపంథా

హైదరాబాద్ : నగర శివార్లలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు రెవెన్యూ అధికారులు కొత్త పంథాను అనుసరించనున్నారు. ప్రధానంగా రంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ, నిజాం వారసుల భూములు కొనుగోలు చేశామంటూ కొందరు తప్పుడు రికార్డులు సృష్టించి వాటిని సొంతం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కోర్టులను ఆశ్రయిస్తున్నారు. వీటికి చెక్‌పెట్టేందుకు 1940 నుంచి 2019వ సంవత్సరం ధరణి



పోర్టల్‌లో నమోదయ్యేంత వరకూ మధ్యలో ఉన్న రెవెన్యూ రికార్డులు, పహాణీలు, శేత్వార్ రికార్డులను కంప్యూటరీకరణ చేయనున్నారు. వీటి ఆధారంగా సరిహద్దులను గుర్తించి ఎక్కడైనా ఆక్రమణలుంటే వాటిపై చర్యలు చేపట్టనున్నారు.

నిషేధిత జాబితాలోని..చాలామంది ఆక్రమార్కులు నిషేధిత జాబితాలో ఉన్నవాటిపైనే గురిపెడుతున్నారు. దీంతో అధికారులు నిషేధిత జాబితాలో ఉన్న ప్రభుత్వ భూమి ప్రైవేటు వ్యక్తుల పేర్లతో ఎప్పుడు రికార్డుల్లోకి వచ్చిందనేది క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. సరిహద్దులను డిజిటల్ సర్వేలు నిర్వహించనున్నారు. నిషేధిత జాబితాలోని భూముల్లో నిర్మాణాలుంటే నిర్మాణాలను కూల్చేయనున్నారు.

న్యాయ వివాదాల్లో ఉన్నవాటిపై...

ప్రభుత్వ భూముల సర్వే నంబర్లకు బై నంబర్లు వేసి తప్పుడు పత్రాలు సృష్టించి న్యాయస్థానంలో కేసులు వేస్తున్నారని గుర్తించారు. ఒక్కో కేసుకు సంబంధించిన అంశాలను అధికారులతో చర్చించి ప్రభుత్వ న్యాయవాదులకు వివరించి అవి ప్రభుత్వ భూములేనని బలమైన ఆధారాలను సమర్పించేలా కార్యాచరణ రూపొందించారు.

## స్థలం సర్కారుది.. పత్రం ప్రైవేటుది

హైదరాబాద్ : రాజధానిలో రూ.500 కోట్ల విలువైన ఏడు ఎకరాల ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జా చేశారు. ఆపైన కొంత స్థలంలో తప్పుడు పత్రాలతో నిర్మాణాలు చేశారు. మరికొంత స్థలంలో భారీ షెడ్లు, గోదాములు నిర్మించి వ్యాపార కేంద్రంగా మార్చారు. స్థానికుల ఫిర్యాదుతో ఉప్పల్ ఎమ్మార్వో, జిల్లా సర్వే విభాగం అసిస్టెంట్ డైరెక్టర్, టీఎస్ఐఐసీ అధికారులు సంయుక్తంగా సర్వే చేపట్టారు. మొత్తం 22 మంది ఆక్రమణదారులు 7 ఎకరాలను కబ్జా చేసినట్లు కలెక్టర్‌కు నివేదిక పంపారు. ఆమేరకు మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ పోట్రు తాజాగా జీహెచ్ఎంసీ కమిషనర్‌కు నిర్మాణ అనుమతి రద్దు చేయాలని కోరుతూ లేఖ పంపారు. ఆ లేఖ ప్రకారం.. ఎం.రోహిత్‌రెడ్డి, జి.వెంకటేశ్‌రెడ్డి,



జె.రాజశేఖర్‌రావులు హబిటాట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ పేరుతో ఉప్పల్ కల్యాణి లక్ష్మీనారాయణ కాలనీలో 584 సర్వే నంబరులోని 31గుంటల భూమిలో సెల్లారుస్టిల్ట్7అంతస్తుల అపార్ట్‌మెంట్‌కు 2021 జూన్ 10 నిర్మాణ అనుమతి పొందారు. ఫ్లాట్లు కొనుగోలు చేసిన వారి పరిస్థితి ఏంటనే విషయమై చర్చ జరుగుతోంది.

కళ్లు మూసుకున్న అధికారులు..

ఆక్రమించిన భూమిలో అపార్ట్‌మెంట్‌కు నిర్మాణ అనుమతి లభించిన కొన్ని రోజులకే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు అందింది. ఆగస్టు 25, 2021న మండల సర్వేయరు ఎమ్మార్వోకు ఇచ్చిన నివేదిక ప్రకారం.. 581/1 సర్వే నంబరులో మొత్తం 217ఎకరాల 34గుంటల భూమి ఉంది. అందులో 9 ఎకరాల ఒక గుంట ప్రభుత్వ భూమి. రెండెకరాల ఒక గుంట భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉండగా, మిగిలిన 7ఎకరాలను 22 మంది ఆక్రమించారు.

# చిరు ధాన్యం.. సాగులో దైన్యం



కరీంనగర్: జొన్న అంబలి, రాగి జావ, మక్క గట్క, ఉలవ చారు, కొర్రల దోశ, సామల ఉప్మా.. ఇలా చిరుధాన్యాల ఆహారాలపై జనంలో ఆసక్తి పెరుగుతోంది. మార్కెట్‌లో వీటికి మంచి డిమాండ్ ఉంది. కానీ కొన్నేళ్లుగా ఉమ్మడి జిల్లాలో చిరుధాన్యాల సాగు గణనీయంగా తగ్గిపోతోంది. సాగునీటి లభ్యత పెరిగి రైతులు వరి సాగుకే మొగ్గు చూపుతుండటంతో.. కీలకమైన చిరుధాన్యం పంటల జాడ కనిపించడం లేదు. పెరుగుతున్న వ్యాధులు, మారుతున్న జీవన శైలిలో వీటి ప్రాధాన్యం పెరుగుతున్నా.. స్థానికంగా పంటలు లేక ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి మన వద్ద నెలకొంది.

ఉమ్మడి జిల్లాలో 2020లో వరి 7.17 లక్షల ఎకరాల్లో సాగు చేయగా 2024లో 8.19 లక్షల ఎకరాల్లో నాట్లు వేశారు. నాలుగేళ్లలో 1,74,272 ఎకరాల్లో ఈ పంట పెరగడం రైతులు ఆ పంట సాగుపై చూపుతున్న ఆసక్తిని తెలుపుతోంది. పద్నాలుగు లక్షల ఎకరాలకుపైగా వ్యవసాయ భూమి ఉన్న నాలుగు జిల్లాల్లో చిరుధాన్యాలను పండించేందుకు అనువైన వాతావరణం ఉందని ఆయా సందర్భాల్లో వ్యవసాయశాస్త్రవేత్తలు, అధికారులు చెప్పారు. మన ప్రాంత నేలలు అన్ని పంటలకు అనుకూలం. పైగా పంటల మార్పుతో దిగుబడి ఎక్కువగా వస్తుంది. అయితే వరి సాగు విపరీతంగా పెరుగుతోంది. సమృద్ధిగా వానలు కురుస్తుండటం, జలాశయాల ద్వారా నీరు అందుతుండటంతో సాగు యోగ్యత పెరిగింది. 2020లో 10.49 లక్షల ఎకరాల్లో అన్ని పంటలు వేయగా.. ఈ ఏడాది 11.65 లక్షల ఎకరాలకు చేరింది. సాగు భూమి పెరగడంతో ప్రధాన పంటల స్థాయి అదే విధంగా పెరిగింది. చిరుధాన్యాల పరంగా మాత్రం పురోగతి లేదు. మొత్తం సాగైన విస్తీర్ణంలో నాలుగేళ్ల కిందట మొక్కజొన్న, కందులతోపాటు ఇతర తృణధాన్యాల శాతం 7.26 ఉండగా ప్రస్తుతమది.. 3.97 శాతానికి పడిపోయింది.

రోజుకు 850 కిలోలు..

నాలుగు జిల్లాల్లో కొర్రలు, అండుకొర్రలు, ఊదలు, అరకలు, సజ్జలు, రాగుల కొనుగోలు పెరుగుతోందని వ్యాపారులు చెబుతున్నారు. రోజులో దాదాపుగా 850 కిలోలు విక్రయిస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఇక్కడ పంటలు లేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్ మార్కెట్‌కు ఇవి వస్తుండటంతో అక్కడి నుంచి తెప్పిస్తామంటున్నారు. ఇవన్నీ కొంచెం అటూ ఇటుగా రూ.200–300 కిలో చొప్పున అమ్ముతున్నారు. ఇలా నెలకు 255 కింటాళ్లు, ఏడాదికి 3,060 క్వింటాళ్లు తినడం కోసం జిల్లా వాసులు కొనుగోలు చేస్తున్నారు. మొక్కజొన్న, కందులు, పెసలు, మినుములు కాకుండా కేవలం చిరు ధాన్యాల వ్యాపారమే ఏటా రూ.6.25 కోట్లను దాటుతుండటం గమనార్హం.! ఈ నేపథ్యంలో వ్యవసాయ వార్షిక ప్రణాళికలో విధిగా గ్రామాల వారీగా చిరుధాన్యాల సాగు లక్ష్యాన్ని నిర్ణయించి ఆ దిశగా అధికారులు దృష్టి పెట్టాల్సి ఉంది. పెట్టుబడి తక్కువగా ఉండటం, దిగుబడి ఎక్కువగా వస్తుందనే విషయాన్ని రైతులకు వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు సమగ్రంగా వివరించి ఆసక్తి పెంచాలి. కచ్చితంగా కొంత విస్తీర్ణంలో ప్రతి రైతు ఏదో ఒక చిరుధాన్యం పంటని వేయాలనే అవగాహనను పెంచుతేనే రైతులు దృష్టి పెట్టే అవకాశముంది.

సాగు తగ్గడానికి కారణాలివీ..

వ్యవసాయం అంటేనే వరి అనే విధంగా పరిస్థితులు మారడం.

ఇతర పంటలు వేస్తే మార్కెటింగ్ సమస్య ఉండటం.

ప్రభుత్వ రాయితీలు లేకపోవడం, విత్తనాల లభ్యత కష్టమవడం.

ఒకవేళ పంట పండించినా స్థానికంగా అమ్మే వీలు లేకపోవడం.

చిరుధాన్యాలతో లాభాలివీ..

ప్రొటీన్, పీచు, విటమిన్స్ అధికంగా ఉంటాయి.

రోగనిరోధక శక్తికి దోహదపడతాయి.

తక్కువ నీటితోనే పండుతాయి.

వీటి సాగుతో భూమి కూడా సారవంతం అవుతుంది.

# విద్యుత్తు వెలుగుల రామగుండం



గోదావరిఖని : రాష్ట్రంలోనే అతిపెద్ద విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలకు నిలయంగా రామగుండం మారనుంది. ఇప్పటికే 4,200 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేస్తోంది. రానున్న రోజుల్లో మరో 3,700 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పే అవకాశముంది. రామగుండం ఎన్టీపీసీ, తెలంగాణ జెన్‌కో, సింగరేణి ద్వారా భారీ విద్యుత్తు ప్రాజెక్టులు నిర్మించేందుకు ప్రణాళికలు చేస్తున్నారు.

ఇప్పటికే 2,600 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలను ఎన్టీపీసీ నెలకొల్పింది. వీటితోపాటు ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు ద్వారా 1600 మెగావాట్ల ఉత్పత్తి కేంద్రాలు పనిచేస్తున్నాయి. త్వరలోనే మరో 2400 మెగావాట్ల కేంద్రాలను నిర్మించనుంది. తాజాగా తెలంగాణ జెన్‌కో 800 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు సూత్రప్రాయంగా ప్రకటన చేసింది. దీంతోపాటు హైడ్రో ప్రాజెక్టు ద్వారా 500 మెగావాట్లను ఉత్పత్తి చేసేందుకు సింగరేణి ప్రతిపాదనలు తయారు చేసింది.

సూపర్ క్రిటికల్ కేంద్రం

రామగుండం బి–థర్మల్ విద్యుత్తు కేంద్రంలో.. 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. 62.5 మెగావాట్ల విద్యుత్తు కేంద్రం స్థానంలో దీనిని నిర్మించాలన్న డిమాండ్ మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇటీవల పరిశీలించి నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు సూత్రప్రాయంగా ప్రకటన చేశారు. దీన్ని జెన్‌కో, సింగరేణి సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టేందుకు ప్రణాళికలు చేయనున్నట్లు తెలిపారు. కాగా 1972, జూన్‌లో నిర్మించిన 62.5 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం.. 50 ఏళ్లకు పైగా సేవలందించింది.

హైడ్రో విద్యుత్తు..

సింగరేణి యాజమాన్యం మూసివేసిన మేడిపల్లి ఓసీపీలో.. హైడ్రో విద్యుత్తు కేంద్రాన్ని రూ.2,535 కోట్లతో నిర్మించేందుకు ప్రణాళికలు చేశారు. మేడిపల్లి ఓసీపీ క్వారీలో ఉన్న నీటిని పంపింగ్ ద్వారా ఎత్తిపోసి.. తిరిగి దిగువకు సరఫరా చేయడంతో ఏర్పడే ప్రక్రియ ద్వారా విద్యుత్తును ఉత్పత్తి చేస్తారు. దీనికి సంబంధించిన సర్వే పనులను సింగరేణి ఇప్పటికే పూర్తిచేసి.. ప్రాజెక్టు నివేదికలు కూడా తయారుచేసింది. ఏడాదికి 1560 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయవచ్చని అంచనా వేస్తున్నారు. 40 ఏళ్ల జీవితకాలంతో రూపొందించే ఈ హైడ్రో కేంద్రం ద్వారా.. సింగరేణి 500 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసే అవకాశముంది.

ఎన్టీపీసీ రెండో దశ పనులు

ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు రెండో దశ పనులను త్వరలోనే చేపట్టనున్నారు. మొదటి దశలో 1600 మెగావాట్ల రెండు యూనిట్లను నిర్మించిన ఎన్టీపీసీ.. రెండో దశలో 2,400 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలను నిర్మించేందుకు టెండర్ ప్రక్రియ పూర్తి చేసింది. తెలంగాణ విభజన చట్టంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం 4 వేల మెగావాట్ల విద్యుత్తు కేంద్రాలను నిర్మించాల్సి ఉంది. అందులో భాగంగానే రామగుండం ఎన్టీపీసీలో ఇప్పటికే 1600 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాలను నిర్మించారు. మరో 2400 మెగావాట్ల మూడు యూనిట్ల రెండో దశ పనులను కూడా త్వరలో ప్రారంభించనున్నారు.

# ధూల్‌పేట గణపతి.. అడిగినంత రాయితీ



హైదరాబాద్: పెరిగిన విగ్రహాల తయారీ.. తగ్గిన ధరలు

11 అడుగుల కంటే ఎక్కువ ఎత్తైన విగ్రహాలను భద్రపరిచే షెడ్ల సంఖ్య పెరిగింది

ఐదు అడుగుల నుంచి 19 అడుగుల ఎత్తైన విగ్రహాలకు సంబంధించి సుమారు 200 విక్రయ కేంద్రాలు ఏర్పాటయ్యాయి

గతంలో రూ.60వేలకు కొన్న 14 అడుగుల విగ్రహం ఈసారి రూ.40వేలకే కొనుగోలు చేసినట్లు పటాన్‌చెరుకు చెందిన గణేశ్ యువజన మండలి సభ్యులు తెలిపారు. ధూల్‌పేట అంటేనే వినాయక విగ్రహాలకు పెట్టింది పేరు. నవరాత్రి వేడుకల నేపథ్యంలో నగరంతోపాటు ఇతర జిల్లాల నుంచి విగ్రహాల కొనుగోలుకు భక్తులు తరలివస్తున్నారు. భారీ వాహనాలు, ట్రాక్టర్లు, ఆటోలు పెద్దఎత్తున వస్తుండటంతో కిక్కిరిసిపోతోంది. గతంతో పోల్చితే ఈసారి పెద్ద మొత్తంలో విక్రయాలు సాగుతాయని భారీగా గణనాథులను సిద్ధం చేయగా అనుకున్న స్థాయిలో విక్రయాలు జరగలేదు. దీంతో ధరలు తగ్గించి అమ్మకాలు సాగిస్తున్నామని వ్యాపారులు తెలిపారు.

మూడ్రోజులే ఉండడంతో..

గతేడాది కొనుగోళ్లను అంచనా వేసుకొని ధూల్‌పేట్‌లో ఈసారి పెద్ద ఎత్తున విగ్రహాల తయారీ చేపట్టారు. ఏ గల్లీలో చూసినా 5అంగుళాల నుంచి 10 అడుగుల విగ్రహాలు విక్రయాలకు సిద్ధమైపోయాయి. కొందరు అపార్ట్‌మెంట్ పార్కింగ్ స్థలాలను విక్రయ కేంద్రాలుగా మార్చారు. అనుకున్న స్థాయిలో ముందస్తు బుకింగ్‌లు లేకపోవడంతో పెద్ద విగ్రహాల విక్రయాలు జరగలేదు. చిన్న విగ్రహాలను మహిళలు విక్రయిస్తున్నారు. షోలాపూర్, ముంబయిలో ప్రాముఖ్యం ఉన్న డిజైన్లలో వేల సంఖ్యలో విగ్రహాలను రూపొందించారు. వీటికి తోడు గతేడాది మిగిలిన స్టాక్ పోగవ్వడంతో వాటికి రంగులద్ది విక్రయానికి ఉంచారు. కొనుగోలుదారులు భారీ రాయితీలు అడుగుతున్నారని, స్టాక్ ఎక్కువగా ఉండటంతో చేసేది లేక అడిగిన ధరలకే విక్రయించాల్సి వస్తోందని వ్యాపారి 'ధ్రువ్' వాపోయారు.

# అడ్డగోలుగా తిరిగేస్తున్నాయ్!

హైదరాబాద్ : ఈ రెండు ఘటనలే కాదు.. రోడ్లపైకి ఇష్టారీతిన దూసుకొస్తున్న భారీ వాహనాలు, ట్రక్కులు అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నాయి. నిర్దేశిత వేళల్లోనే నగరంలోకి రావాలన్న నిబంధనలు ఉన్నా.. కొందరు డ్రైవర్లు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. ఇలా చేస్తుంటే..: ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు కొత్వాల్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరిలో కొత్త నిబంధనలు అమల్లోకి తీసుకొచ్చారు. భారీ వాహనాల ప్రవేశంపై ఆంక్షలు విధించారు. కొన్ని నెలలు బాగున్నా.. కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యంతో వాటి అమలు అటకెక్కింది.

29.08.2024 పాఠశాల ముగిశాక ఆరో తరగతి విద్యార్థిని తల్లితో కలిసి ద్విచక్రవాహనంపై ఇంటికెళ్తోంది. హబ్సిగూడ దగ్గర రోడ్డు దాటుతుండగా భారీ వాహనం ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన చిన్నారి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించింది.

17.08.2024

ఆటోలో పదో తరగతి విద్యార్థిని పాఠశాలకు వెళుతుండగా వెనుక



నుంచి దూసుకొచ్చిన లారీ ఢీకొంది. ఈ తాకిడికి ఆటో ముందున్న బస్సు కింద ఇరుక్కుపోయింది. అందులో విద్యార్థిని మరణించింది. ఆటోడ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు.

ఇవీ నిబంధనలు

నగరంలోని కీలకమైన 94 మార్గాల్లో జాతీయ పర్మిట్, అంతర్ జిల్లాల్లో ప్రయాణించే భారీ వాహనాలు, లారీలు, ట్రక్కులు, టస్కర్లు వంటి వాణిజ్య వాహనాల ప్రవేశం, పార్కింగ్‌పై పూర్తిగా నిషేధం.

స్థానిక లారీలు, నిర్మాణ సామగ్రి తరలించే వాహనాలు, ట్రక్కులు, టస్కర్లు, ట్రైలర్లు, ఎర్త్ మూవింగ్(జేసీబీ) తదితర వాహనాల రాకపోకలు, ఐడల్ పార్కింగ్(ఇంజిన్ ఆన్‌లో ఉంచి నిలపడం) ఉదయం 7 నుంచి రాత్రి 11 గంటల వరకు అనుమతించరు. రాత్రి 11 నుంచి ఉదయం 7 వరకు ముందుగా నిర్దేశించిన 64 మార్గాల్లో మాత్రమే అనుమతిస్తారు. గూడ్సు వాహనాలు(3.5- 10 టన్నుల బరువు) ఉండే డీసీఎం, ఐచర్ తదితర వాహనాల ప్రయాణం, ఐడల్ పార్కింగ్‌ను ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12, సాయంత్రం 4 నుంచి 9 గంటల వరకు అనుమతించరు.

నిర్మాణ రంగ వస్తువులు, వ్యర్థాలు తరలించే 2–6 టన్నుల బరువుండే వాహనాలు, చిన్న టిప్పర్లు ఉదయం 9–11.30 మధ్య సాయంత్రం 5నుంచి 10 గంటల మధ్య అనుమతించరు.

10 టన్నులకు మించి బరువుండే వాహనాలను ఉదయం 7 నుంచి రాత్రి 11 వరకు నగరంలోకి అనుమతించరు.

పరిష్కారమేంటి?

నగర శివార్లలోని ప్రధాన మార్గాల్లోనే భారీ వాహనాల రాకపోకలు అడ్డుకునేలా ప్రత్యేక వ్యవస్థ ఉండాలి.

రాత్రి వేళ నగరంలోకి వచ్చినా.. తెల్లవారాక ఖాళీ ప్రాంతాల్లో వాటిని నిలిపేసేలా చర్యలు తీసుకోవాలి.

ఇలా ఉల్లంఘన

హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల ట్రాఫిక్ పోలీసుల మధ్య సరిహద్దు సమస్యలు వస్తున్నాయి. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు భారీ వాహనాన్ని ఎలా అనుమతించారని విమర్శలు వ్యక్తమైతే ముందు శివారు ప్రాంతాల్లోనే అడ్డుకోలేకపోయారని హైదరాబాద్ పోలీసులు అంటున్నారు.

నగరంలో రద్దీ సమయాల్లో ట్రాఫిక్ గజిబిజిగా ఉంటుంది. ఇక్కడి పరిస్థితులపై లారీ డ్రైవర్లకు అవగాహన లేకపోవడం ప్రమాదాలకు కారణమవుతోంది. భారీ వాహనాలు ఎక్కువగా ఇన్నర్ రింగురోడ్డుపై, సికింద్రాబాద్–ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్, బేగంపేట తదితర ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తున్నాయి.

నాచారం, ఉప్పల్, మల్లాపూర్, ఈసీఐఎల్‌లో పరిశ్రమలు ఎక్కువగా ఉండటంతో ఇక్కడ రాకపోకలు ఎక్కువ.

# ఆక్రమణలపై కొరడా

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మండలంలోని ఐలాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వానికి చెందిన రూ.5.5కోట్ల విలువైన 1.13 ఎకరాల భూమిని ఆక్రమణదారుల నుంచి రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సర్వే నం.462లోని 38 గుంటల భూమి అమీన్‌పూర్ పురపాలక ఛైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ఆక్రమణలో ఉందంటూ నిర్ధారించారు. ఇదే నంబర్‌లో 15 గుంటల భూమి ఫ్యూజియన్ ఇంటర్నేషనల్ పాఠశాల ఆక్రమణలో ఉందని తేల్చారు. మంగళవారం రెండు జేసీబీలతో పోలీస్, మున్సిపల్, రెవెన్యూ అధికారుల బృందం రంగంలోకి దిగింది. నిర్మాణాలను తొలగించే క్రమంలో పాండురంగారెడ్డి తహసీల్దార్ రాధ మధ్య వాగ్వాదం జరిగింది. 38 గుంటల భూమిలో ఉన్న అన్ని నిర్మాణాలను కూల్చివేయించారు. ఫ్యూజియన్ ఇంటర్నేషనల్ పాఠశాల ప్రాంగణంలో 15గుంటల భూమిలో కందకం తవ్వారు. ఐలాపూర్ తండాలో కోర్టులో కేసు నడుస్తున్న భూమిలో జరుగుతున్న నిర్మాణాన్ని తొలగించారు. 119 సర్వే నంబర్‌లోని 469 ఎకరాల భూమిలో క్రయ విక్రయాలు జరపరాదని బోర్డు ఏర్పాటు చేశారు. అదే గ్రామానికి చెందిన మరో ప్రదేశంలో 129 సర్వే నం.లోనూ తహసీఈల్దార్ బోర్డు పెట్టారు. ఐలాపూర్, ఐలాపూర్ తండాలకు చెందిన పూర్తి భూమి కోర్టు వివాదాల్లో ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పవన్, మధుసూదన్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు శ్రీకాంత్ రాథోడ్, రఘునాథ్‌రెడ్డి, ఉపతహసీఈల్దార్ బాలరాజు, సీఐలు నాగరాజు, స్వామిగౌడ్ తదితరులున్నారు.

461 కాదని కూల్చేశారు: పాండురంగారెడ్డి

తాను ఏడేళ్ల క్రితం కొనుగోలు చేసిన భూమి ప్రభుత్వానిది అంటూ నిర్మాణాలను అధికారులు కూల్చివేశారని పాండురంగారెడ్డి చెప్పారు. అమీన్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడారు. సర్వేనం.461లోని భూమిని వీరాచారి నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు అది సర్వే నం.462లో వస్తుందని, కూల్చేస్తామని 15 రోజుల క్రితం నోటీసు ఇచ్చారన్నారు. వివరణ ఇచ్చినా అధికారులు పరిగణనలోకి తీసుకోలేదన్నారు.



# ఐదు రోజుల్లో 10లక్షల మందికి ఆహారం

అమరావతి: గత ఐదు రోజులుగా సుమారు 10 లక్షల మంది వరద బాధితులకు ఆహారం అందించామని అక్షయపాత్ర విజయవాడ, గుంటూరు ప్రెసిడెంట్ వంశీదాస ప్రభు చెప్పారు. దివీస్ ల్యాబ్, ప్రభుత్వ సహకారంతో రికార్డు స్థాయిలో బాధితులకు ఆహారాన్ని అందించామన్నారు. ప్రభుత్వం ఎప్పుడు, ఎంత అడిగినా అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వంశీదాస చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతోనే ఇంత మందికి అందించగలిగామన్నారు. తాము ఎంత ఆహారం వండినా .. దానిని బాధితుల వద్దకు చేర్చడం గొప్ప విషయమన్నారు.

అక్షయపాత్ర చరిత్రలో 10లక్షల మందికి ఆహారం అందించడం రికార్డు అని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎన్ని రోజులు చేయమంటే అన్ని రోజులు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

# విజయవాడ పారిశుద్ధ్య పనుల్లో వేగం పెంచండి..: సీఎం చంద్రబాబు ఆదేశం

విజయవాడ: నగరంలో వరద సహాయక చర్యలపై మంత్రులు, అధికారులతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వరద ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను అధికారులు సీఎంకు వివరించారు. ఫైరింజన్లతో రోడ్లు, కాలనీలు, ఇళ్ల శుభ్రతను మరింత వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు.

వరదలకు ఇళ్లల్లో చెడిపోయిన ఎలక్ట్రానిక్ వస్తువులను రిపేర్ చేయించేందుకు నిపుణులను పిలిపించాలన్నారు. బుడమేరుకు పడిన గండ్ల పూడ్చివేత పనులను సీఎంకు అధికారులు వివరించారు.




**ఆర్మీ సహకారంతో గండ్ల పూడ్చివేత :** మరోవైపు బుడమేరు గండ్ల పూడ్చివేతలో భారత ఆర్మీకి చెందిన టాస్క్‌ఫోర్స్ విభాగం పనిచేస్తోంది. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి.. ఇప్పటికే రెండు గండ్లను పూడ్చివేశారు. క్లిష్టంగా ఉన్న మూడో గండికి ఆర్మీ సహకారంతో పూడ్చివేత పనులు కొనసాగుతున్నాయి.

ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గం కొండపల్లి కవులూరు వద్ద బుడమేరు వద్దకు మద్రాస్ ఆర్మీ చేరుకుంది. పరికరాలతో రంగంలోకి దిగింది. శరవేగంగా ఇక్కడ పనులు కొనసాగుతున్నాయి.

**వరద బాధితులకు నేటి నుంచి నిత్యావసర కిట్లు పంపిణీ :** వరద ప్రభావిత ప్రాంతాల్లో బాధితులకు నిత్యావసర కిట్లను నేటి నుంచి పంపిణీ చేయనున్నారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వీటిని పంపిణీ చేస్తారు. మొదటి రోజు 50 వేల కుటుంబాలకు కిట్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఒక్కో కిట్‌లో 25 కేజీల బియ్యం, కిలో కందిపప్పు, కిలో పంచదార, 2 కిలోల ఉల్లి, 2 కిలోల బంగాళదుంపలు, లీటర్ నూనె ఉంటాయి. మొత్తం 2 లక్షల కుటుంబాలకు వీటిని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈపోస్ మిషన్ ద్వారా వీటిని పంపిణీ చేయనున్నారు. రేషన్ కార్డు లేని వారికి.. ఆధార్, బయోమెట్రిక్‌ల ద్వారా అందించనున్నారు.

# వైఎస్ జగన్‌కు ఊహించని షాక్.. పాస్‌పోర్ట్ రద్దు



అమరావతి: ముఖ్యమంత్రి పదవి పోయాక వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి కష్టాలు మొదలయ్యాయి. ఇప్పటికే పార్టీకి సిట్టింగులు, కీలక నేతలు గుడ్ బై చెబుతున్నారని సతమతం అవుతుండగా అధినేతకు తాజాగా మరో ఊహించని ఝలక్ తగిలింది. వైఎస్ జగన్ పాస్‌పోర్టు రద్దయ్యింది.

దీంతో ఆయనకు పాస్‌పోర్టు కష్టాలూ వచ్చిపడ్డాయి. ముఖ్యమంత్రి పదవి పోవడంతో జగన్ డిప్లొమాట్ పాస్‌పోర్టును రద్దు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

**ఆఖరికి ఇలా..! :** దీంతో చేసేదేమీ లేక జనరల్ పాస్‌పోర్ట్ కోసం ఆయన దరఖాస్తు చేసుకున్నారు. 5 సంవత్సరాలు జనరల్ పాస్‌పోర్ట్ ఇవ్వాలని హైదరాబాద్ సీబీఐ కోర్టు ఆదేశించడం జరిగింది. ఈ వ్యవహారంపై విజయవాడ ప్రజాప్రతినిధుల కోర్టులో మాజీ సీఎం పిటీషన్ దాఖలు చేశారు. అయితే.. దీనిపై విచారించిన కోర్టు.. కేవలం ఒక సంవత్సరానికి పాస్‌పోర్ట్ ఇవ్వాలని ఆదేశించింది.

అయితే.. తనకు ఐదు సంవత్సరాలకు పాస్ పోర్టు ఇవ్వాలని హైకోర్టులో వైఎస్ జగన్ ఇవాళ.. లంచ్ మోషన్ పిటీషన్ దాఖలు చేయడం జరిగింది. ఈ పిటిషన్‌పై విచారణ సోమవారానికి రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం వాయిదా వేసింది. దీంతో లండన్ ప్రయాణంను వైఎస్ జగన్ వాయిదా వేసుకున్నారు.

**ఇలా అనుకున్నారు కానీ..** వాస్తవానికి వైఎస్ జగన్ సెప్టెంబర్-03న సతీసమేతంగా లండన్ బయల్దేరి వెళ్లాలని అనుకున్నారు. ఇందుకు సీబీఐ ప్రత్యేక కోర్టు ఇటీవల అనుమతి కూడా ఇచ్చింది. కుమార్తె పుట్టినరోజు వేడుకల కోసం 25 దాకా అక్కడే ఉండాలని భావించారు. ఈ క్రమంలో అక్రమాస్తుల కేసులు ఒకవైపు.. ముఖ్యమంత్రిగా పాలనా సమయంలో తీసుకున్న అనుచిత నిర్ణయాలపై విచారణలు ఇంకోవైపు.. పార్టీ రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, బీద మస్తాన్‌రావు రాజీనామా చేసి టీడీపీలోకి వెళ్లేందుకు సమాయత్తం కావడం, పార్టీకి ఉన్న 11 మంది రాజ్యసభ సభ్యుల్లో నలుగురు తప్ప మిగతావారు పక్కచూపులు చూస్తున్నారన్న ప్రచారంతో భవిష్యత్‌పై వైసీపీ శ్రేణులు కలవరపడుతున్నాయి. ఈ తరుణంలో ఆయన విదేశీ పర్యటన వారిని ఇరకాటంలో పడేస్తోంది. దీనికి తోడు పాస్‌పోర్టు కూడా రద్దు కావడంతో చేసేదేమీ లేక వాయిదా వేసుకున్నారు. అంతేకాదు.. డిప్లొమాట్ పాస్‌పోర్టుకు బదులుగా జనరల్ పాస్‌పోర్టుకు అప్లయ్ చేసుకున్నారు. ఇందులోనూ ఏడాది మాత్రమే అని కోర్టు.. ఐదేళ్లు కావాలని జగన్ అడుగుతున్నారు. ఏపీ హైకోర్టు సోమవారం నాడు ఏం తేలుస్తుందో చూడాలి మరి.

# దెబ్బతిన్న పంటలను పరిశీలించిన కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్



విజయవాడ: కృష్ణా జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ పర్యటించారు. కేసరపల్లిలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలించారు. ఆయన వెంట కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, సుజనా చౌదరి, భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తదితరులు ఉన్నారు. కేంద్రం అన్ని విధాలా ఆదుకుంటుందని రైతులకు ఆయన భరోసా ఇచ్చారు.

# జగన్ వల్ల రాష్ట్రానికి ప్రమాదం.. రామ్మోహన్ సంచలన కామెంట్స్



విశాఖపట్నం, సెప్టెంబర్ 6: మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... జగన్ ఇంకా నెగిటివ్ యాటిట్యూడ్‌తో ముందుకు వెళుతున్నారంటూ విమర్శలు గుప్పించారు. జగన్ వల్ల రాష్ట్రానికి ప్రమాదం ఉంది కాబట్టే మొన్నటి ఎన్నికల్లో ఆయన్ను ప్రజలు దూరం పెట్టారన్నారు. ఆయన ఎక్కడకు వెళ్తే అక్కడ రాష్ట్ర ప్రజలకు ప్రమాదం ఉందన్నారు. భయపడవలసింది జగన్ కాదు, రాష్ట్ర ప్రజలు అని అన్నారు. గత ఐదేళ్ల జగన్ పాలనకు ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారని... అయినా పద్ధతి మార్చుకోలేదంటూ వ్యాఖ్యలు చేశారు. విజయవాడ వరదలపై జగన్మోహన్ రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బుడమేరు కాలువకి గేట్లు ఎత్తేసామని.. అమరావతి పూర్తిగా మునిగిపోయిందని అంటున్నారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో రాజకీయం చేయాలని ఆలోచన జగన్‌కు రావడం దురదృష్టకరమన్నారు. వరదల్ని రాజకీయాలు చేయడం జగన్మోహన్ రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య అంటూ మండిపడ్డారు. విపత్తు పరిస్థితుల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా చంద్రబాబు డ్రోన్లు వినియోగించి బాధితులను ఆదుకున్నారన్నారు. వరదలు వచ్చినప్పుడు మనుషులు చేరుకోలేని ప్రాంతాల్లో కూడా డ్రోన్ల ద్వారా సహాయం అందించామన్నారు. ఇంతగా సహాయం చేస్తున్నా జగన్ బురద రాజకీయాలు చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వరద నష్టం అంచనా కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. జాతీయ విపత్తు అంశంపై కేంద్రంతో మాట్లాడుతున్నామని కేంద్రమంత్రి వెల్లడించారు.

**చంద్రబాబుపై ప్రశంసలు..** మరోవైపు సీఎం చంద్రబాబుపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ప్రశంసలు కురిపించారు. సీఎం చంద్రబాబు పనితీరు మరోసారి ప్రూవ్ అయ్యిందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు ఎదుర్కోవడంలో సీఎం చంద్రబాబు తనకు తానే సాటి అని నిరూపించుకున్నారని తెలిపారు. తితిలీ తుఫాన్ సమయంలో బాబు విశేష సేవలు అందించారని గుర్తుచేశారు. ప్రతిపక్షాలు అనవసర విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. వరదలను కూడా రాజకీయ లబ్ధికి వాడుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలన చూసి ప్రజలు విసుగుచెంది బుద్ధి చెప్పారన్నారు. సోషల్ మీడియాలో సహాయ కార్యక్రమాలపై దుష్ప్రచారం చేస్తున్నారని... అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో మాట్లాడుతోందని... కేంద్రం ఎప్పటికప్పుడు కావాల్సిన సహకారం అందిస్తోందని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.



# బుడమేరు డ్రోన్ విజువల్స్

## శరవేగంగా బుడమేరు గండ్లు పూడ్చివేత పనులు.. డ్రోన్ విజువల్స్

**బుడమేరు గండ్లు పూడ్చివేత పనులు శరవేగంగా సాగుతున్నాయి. కొండపల్లి సమీపంలోని శాంతినగర్ వద్ద బుడమేరుకు పడ్డ మూడవ గండిని అధికారులు యుద్ధప్రాతిపదికన పూడ్చివేస్తున్నారు. ఇప్పటికే 2 గండ్లను విజయవంతంగా పూర్తిచేశారు. మూడవ గండిని పూడ్చితేనే విజయవాడ నగరంలోకి వరద నీరు రాకుండా అడ్డుకట్ట పడుతుంది.**

# రాయనపాడు వద్ద మళ్లీ పెరిగిన బుడమేరు ఉద్ధృతి

విజయవాడ: నగర శివారు రాయనపాడు వద్ద బుడమేరు ఉద్ధృతి మళ్లీ పెరిగింది. గురువారం రాత్రి 10 గంటల నుంచి గ్రామంలోకి వరద తాకిడి ఎక్కువైంది. దీంతో అక్కడి ఇళ్లు నీట మునిగాయి. రాయనపాడు రైల్వేస్టేషన్‌లో ట్రాక్‌లపైకి వరదనీరు చేరింది. బుడమేరు వరద ప్రవాహంతో గ్రామస్థుల్లో ఆందోళన నెలకొంది. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయ కార్యక్రమాలు కొనసాగిస్తున్నాయి. మరోవైపు బాధితులకు పాలు, పండ్లు, ఇతర నిత్యావసరాలను అధికారులు అందిస్తున్నారు.

# వాయుగుండం ముప్పు తప్పింది




విశాఖపట్నం: నాలుగు రోజుల క్రితం కురిసిన అతి తీవ్ర వర్షాలతో ముంచెత్తిన వరదల ప్రభావంతో అతలాకుతలం అయిన ఆంధ్రప్రదేశ్‌కు విశాఖపట్నం వాతావరణ కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. ఏపీకి వాయుగుండం ముప్పు తప్పిందని వెల్లడించింది. దీంతో ఏపీ వాసులు ఊపిరి పీల్చుకున్నట్టు అయింది. కాగా మధ్య బంగాళాఖాతం, ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోందని, ఇది ఉత్తర దిశగా పయనిస్తోందని తెలిపింది. 9వ తేదీ నాటికి ఇది ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీరాలకు అనుకోని వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని చెప్పింది.

**ఈ జిల్లాలకు వర్ష సూచన :** వాయుగుండం ముప్పు తప్పినప్పటికీ రాగల 24 గంటల్లో కోస్తాంధ్ర జిలాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని విశాఖపట్నం వాతావరణ కేంద్రం అప్రమత్తం చేసింది. అల్లూరి, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, కాకినాడ జిల్లాలో కొన్ని చోట్ల భారీ వర్షాలు అవకాశం ఉందని హెచ్చరించింది. ఇక రేపు ఏలూరు, శ్రీకాకుళం, అల్లూరి పార్వతీపురం జిల్లాలలో అక్కడక్కడ వర్షాలు పడే ఛాన్స్ ఉందని తెలిపింది. తీరం వెంబడి బలమైన గాలులు వీస్తాయని, మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

**బుడమేర గండి పడిన ప్రాంతంలో కుండపోత వర్షం..** బుడమేరుకు గండి పడిన ప్రాంతంలో కుండపోతగా వర్షం కురుస్తోంది. అయితే వర్షం కురుస్తున్నప్పటికీ గండి పూడ్చివేత పనులు కొనసాగుతున్నాయి. గండి పూడ్చుతూనే మరోవైపు నీటిని కట్టడి చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. మచిలీపట్నం నుంచి వచ్చిన బోట్లను బుడమేరు గండి పడిన ప్రాంతానికి తరలించారు. తాత్కాలికంగా రేకుల ద్వారా వరద నీటికి అడ్డుకట్ట వేయాలని అధికారులు భావిస్తున్నారు. మరోవైపు గండి పడిన ప్రాంతానికి పెద్ద స్థాయిలో మిలిటరీ అధికారులు చేరుకున్నారు. 6వ మద్రాస్ మిలిటరీ బెటాలియన్ నుంచి వచ్చిన 120 మంది అధికారులు, జవాన్లు వచ్చారు. మరికొద్ది సేపట్లోనే మిలిటరీ ఆధ్వర్యంలో గండి పూడ్చివేత కార్యక్రమం మొదలుకానుంది. తాత్కాలికంగా రాడ్డులతో వంతెనల్లాగా నిర్మాణం చేసి దాంట్లో రాళు వేసి పూడుస్తామని మిలిటరీ అధికారులు చెబుతున్నారు. ప్రణాళికలో భాగంగా మరి కొద్ది సేపట్లో బుడమేరు గండి పడిన ప్రాంతానికి మిలిటరీ అధికారుల సామాగ్రి చేరనుంది.

# వైసీపీ నిర్లక్ష్యం వల్లే బుడమేరుకి గండి పడింది..

విజయవాడ: వారం రోజులపాటు కురిసిన భారీ వర్షాలకు బుడమేరుకు గండి పడి విధ్వంసం జరిగిన సంగతి తెలిసిందే. అయితే అప్రమత్తమైన ఏపీ అధికార యంత్రాంగం గండి పూడ్చివేత పనులు ముమ్మరం చేసింది. ఈ మేరకు ఆర్మీ జవాన్లతో పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టింది. అయితే గండి పూడ్చివేత పనులను రాజమహేంద్రవరం ఎంపీ, ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వైసీపీపై నిప్పులు చెరిగారు.

**వైసీపీ వల్లే..** ఈ సందర్భంగా ఏపీ బీజేపీ చీఫ్ పురందేశ్వరి మాట్లాడుతూ..” బుడమేరు గండి పూడ్చివేత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రతి సందర్భాన్ని రాజకీయం చేయడం సమంజసం కాదు. ప్రజల ప్రాణాలు పోతున్న సందర్భంలో వైసీపీ నేతలు రాజకీయాలు మాట్లాడుతున్నారు. అసలు గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే బుడమేరుకు గండి పడింది. రూ. 400కోట్లతో గత టీడీపీ ప్రభుత్వం బుడమేరుకట్ట పటిష్ఠతకు పనులు చేపట్టింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ పనులు పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేసింది.

**కేంద్రం ఆదుకుంటుంది..** వైసీపీ నిర్లక్ష్య ధోరణి వల్లనే ఇంత పెద్ద ప్రమాదం ముంచుకొచ్చింది. మిగిలిన పనులను వారి చేసి ఉంటే ఈనాడు ఇలాంటి దుస్థితి ఏర్పడేది కాదు. గత ఐదేళ్ల కాలంలో బుడమేరుకు వైసీపీ ప్రభుత్వం ఎంత ఖర్చు పెట్టిందో లెక్కలు చెప్పాలి. వారు చేసిన పాపాన్ని పక్కవారికి అంటకడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఏపీని వరదల సమయంలో ఆదుకుంటూ వస్తోంది.



గురువారం రోజున కేంద్ర మంత్రి చౌహాన్ వరద ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. త్వరలో ఎంత నష్టం వాటిల్లిందో అంచనా వేసి కేంద్ర ప్రభుత్వం సాయం అందిస్తుంది” అని చెప్పారు.

**విద్యుత్ కార్మికులు సాయం..** మరోవైపు బుడమేరు పొంగి తీవ్ర అవస్థలు పడుతున్న వరద బాధితులకు తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం అండగా నిలిచింది. ఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆధ్వర్యంలో ఒక రోజు మూల వేతనాన్ని సీఎం సహాయనిధికి అందించి కార్మికులు పెద్ద మనసు చాటుకున్నారు. ఈ మేరకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో సీఎం చంద్రబాబుకి విరాళాన్ని అందజేశారు. ఇప్పటికే పలువురు సినీ ప్రముఖులు కోట్లాది రూపాయలు వరద బాధితుల కోసం సీఎం సహాయనిధికి అందించారు.

# సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంపై కేసు నమోదు

తిరుపతి : రాసలీలల ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై తిరుపతి ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు. బలాత్కారం... బెదిరించి రేప్ చేయడంపై కేసు నమోదు అయ్యింది. నిన్న (గురువారం) రాత్రి 11:15 గంటలకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ వెంటనే ఈస్ట్ పోలీసులు కేసు రిజిస్టర్ చేశారు.

సంఘటన జరిగిన బీమాస్ పారడైజ్ హెూటల్ ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండడంతో ఆ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఎఫ్ఐఆర్ నెంబర్ 430/24, డేట్: 5-9-2024 కింద ఎమ్మెల్యే ఆదిమూలంపై పోలీసులు కేసు నమోదు చేశారు.

**చట్టపరమైన చర్యలకు...** కాగా.. ఈ వ్యవహారానికి సంబంధించి చట్ట పరమైన చర్యల తీసుకునేందుకు నిన్న(గురువారం) ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంపై పార్టీకి చెందిన మహిళ కార్యకర్త లైంగిక వేధింపులు ఆరోపణలు చేసింది. కొన్ని ప్రైవేటు వీడియోలను సైతం బాధితురాలు రిలీజ్ చేసింది. గురువారం నాడు హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాకు బాధితురాలు, తన భర్తతో కలిసి వచ్చి ఆదిమూలం లైంగిక వేధింపుల పర్వాన్ని బయటపెట్టింది. తిరుపతిలోని బీమాస్ హెూటల్‌లో తనపై లైంగిక దాడి చేశాడని బాధితురాలు వెల్లడించింది. ఇప్పటికే సీఎం చంద్రబాబుతో పాటు మంత్రి నారా లోకేష్‌కు లేఖ రాశానని తెలిపింది. ఎవరికైనా చెబితే చంపేస్తానంటూ ఆదిమూలం తనపై బెదిరింపులకు దిగాడని బాధితురాలు చెప్పింది. తాము కూడా టీడీపీకి చెందిన వారమేనని బాధితురాలు తెలిపింది.

**టీడీపీ హైకమాండ్ సీరియస్..** అయితే ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న టీడీపీ హైకమాండ్ ఎమ్మెల్యేపై సస్పెన్షన్ వేటు వేసింది. ఎమ్మెల్యే ఆదిమూలంను సస్పెండ్ చేస్తున్నట్లు నిన్న (గురువారం) టీడీపీ హైకమాండ్ ఓ ప్రకటన విడుదల చేసింది. ‘ఈ రోజు వివిధ మాధ్యమాలలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఒక మహిళను లైంగికంగా వేధించారని వస్తున్న ఆరోపణలను తెలుగుదేశం పార్టీ తీవ్రంగా పరిగణిస్తూ పార్టీ నుంచి సస్పెండ్ చేయడం జరిగింది’ అని టీడీపీ ప్రధాన కార్యాలయం నుంచి ప్రకటన విడుదలయ్యింది. అలాగే సస్పెన్షన్ తరువాత వివరణ తీసుకోవాలని హైకమాండ్ నిర్ణయించింది. ఆరోపణలు తీవ్రత దృష్ట్యా ముందు సస్పెండ్ చేసి తరువాత వివరణ తీసుకోవాలని హైకమాండ్ నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఆదిమూలం వ్యవహారంపై సీనియర్ నేతలు చంద్రబాబుకు తెలియజేయగా... బాబు సీరియస్ అయ్యారు. కఠిన చర్యలు తీసుకోవాలని.. మరోసారి ఇలాంటి తప్పుడు పనులు చేయడానికి భయపడేలా ఆచర్యలు ఉండాలని ఆదేశించారు. అనంతరం గంటల వ్యవధిలోనే ఎమ్మెల్యే ఆదిమూలంను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటన వెలువడింది.






# రాజ్ తరుణ్, లావణ్య కేసులో బిగ్ ట్విస్ట్..

హైదరాబాద్: హీరో రాజ్ తరుణ్, లావణ్య కేసులో బిగ్ ట్విస్ట్ చోటు చేసుకుంది. రాజ్ తరుణ్ తనకు కావాలని లావణ్య చెబుతోంది. మరో వైపు పోలీసులు ఈ కేసులో రాజ్ తరుణ్ నిందితుడేనని చెబుతున్నారు. రాజ్ తరుణ్, లావణ్య పదేళ్ల పాటు సహ జీవనం చేశారని కూడా పోలీసులు చెబుతున్నారు. రాజ్‌తరుణ్-లావణ్య కేసులో పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఛార్జ్‌షీట్‌లో రాజ్‌తరుణ్‌ను పోలీసులు నిందితుడిగా చేర్చారు. లావణ్యతో రాజ్‌తరుణ్ పదేళ్లు సహజీవనం చేసినట్లు పేర్కొన్నారు. పదేళ్లపాటు రాజ్‌తరుణ్-లావణ్య ఒకే ఇంట్లో ఉన్నారని చార్జిషీట్‌లో తెలిపారు. లావణ్య చెబుతున్న దాంట్లో వాస్తవాలు ఉన్నాయని పోలీసులు తెలిపారు. లావణ్య ఇంటి వద్ద పోలీసులు సాక్ష్యాలు సేకరించారు. ఇప్పటికే ఈ కేసులో రాజ్‌తరుణ్ ముందస్తు బెయిల్ తీసుకున్నాడు. అయితే ఈ విషయమై ఏబీఎన్‌తో లావణ్య మాట్లాడుతూ.. రాజ్ తరుణ్‌పై ఛార్జ్ షీట్ దాఖలు చేయడం శుభ పరిణామమని తెలిపింది. తనను ఎన్నో మాటలు అన్నారని.. చివరికి న్యాయం గెలుస్తుందని తాను భావిస్తున్నానని పేర్కొంది. రాజ్ తరుణ్‌కి వ్యతిరేకంగా వెళ్లాలని తనకు లేదని తెలిపింది. తనకు రాజ్ తరుణ్ కావాలని పేర్కొంది. రాజ్ తరుణ్ ఇంటి నుంచి వెళ్లిపోయిన తర్వాత మానసికంగా ఎంతో బాధపడ్డానని వెల్లడిచింది. శేఖర్ భాష అనే వ్యక్తిని అస్త్రంగా ఉపయోగించి తనపై ఎన్నో నిందలు వేశారని లావణ్య పేర్కొంది. రాజ్ తరుణ్ శిక్ష అనుభవించాలని తాను కోరుకోను, కానీ తనకు న్యాయం చేయాలని కోరుకుంటున్నానని వెల్లడించింది. రాజ్ తరుణ్, తాను పదేళ్లపాటు కలిసి సంసారం చేశామనేది అనేది వాస్తవమని లావణ్య తెలిపింది. వాటికి సంబంధించిన ఆధారాలన్నీ పోలీసులకు ఇచ్చానని వెల్లడించింది. హీరోయిన్ మాల్వి మల్హోత్రా వల్ల తనను రాజ్ తరుణ్ వదిలించుకోవాలని చూశాడని పేర్కొంది. కేసును తప్పుదోవ పట్టించాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారని తెలిపింది. మాల్వి మల్హోత్రా రాజ్ తరుణ్ ఇద్దరికీ ఎఫైర్ ఉందని మరోమారు లావణ్య తెలిపింది. వాటికి సంబంధించిన ఆధారాలను సైతం పోలీసులకు ఇచ్చానని లావణ్య వెల్లడించింది.

# భాగ్యనగరంలో దంచికొడుతున్న భారీ వర్షం

హైదరాబాద్: ఇటీవలే కురిసిన భారీ వర్షాలతో తడిసి ముద్దైన భాగ్యనగరం హైదరాబాద్‌లో మళ్లీ భారీ వర్షం కురుస్తోంది. 5 గంటల సమయంలో వాన ఆరంభమైంది. నగరవ్యాప్తంగా వర్షం పడుతోంది. నాంపల్లి, లక్డీకపూల్, మాసబ్ ట్యాంక్ ప్రాంతాల్లోనైతే కుండపోత వర్షం పడుతోంది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మెహదీపట్నం, టోలిచౌకీ, షేక్‌పేట్, ఫిలింనగర్, గచ్చిబౌలి, హైటెక్ సిటీ, మాదాపూర్, కొండాపూర్, హఫీజ్‌పేట్‌లలో కూడా వర్షం కురుస్తోంది. సాయంత్రం 5 గంటల వరకు హైదరాబాద్‌లో వాతావరణం కాస్త పొడిగానే కనిపించింది. అయితే ఒక్కసారిగా మార్పు వచ్చింది. ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఉదయం ఎండగా ఉన్నప్పటికీ సాయంత్రానికి పరిస్థితి మొత్తం మారిపోయింది.




**మళ్లీ మొదలైన ట్రాఫిక్ కష్టాలు :** అనూహ్యంగా భారీ వర్షం పడుతుండడంతో మహానగరం హైదరాబాద్‌లో మళ్లీ ట్రాఫిక్ సమస్య మొదలైంది. ఎక్కడికక్కడ రోడ్లపై వరద పారుతుండడంతో వాహనదారులు నెమ్మదిగా వెళ్లాల్సి వస్తోంది. ముఖ్యంగా ఉద్యోగులు, కాలేజీ విద్యార్థులు ఇంటికి వెళ్లే సమయం కావడంతో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంది. మరోవైపు రేపు (శనివారం) వినాయక చవితి నేపథ్యంలో ఆ సందడి కూడా నగరంలో కనిపిస్తోంది. ఇందుకు సంబంధించిన పనులకు కూడా వర్షం ఆటంకంగా మారింది.

# జైనూర్ బాధితురాలిని పరామర్శించిన బీఆర్ఎస్ ముఖ్య నేతలు...

కొమురం భీం ఆసిఫాబాద్: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలో ఓ మహిళపై ఆటో డ్రైవర్ అత్యాచార యత్నానికి పాల్పడిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపుతోంది. నేడు బాధితురాలిని బీఆర్ఎస్ నేతలు హరీష్ రావు, సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి పరామర్శించారు. తన తల్లిపై జరిగిన అఘాయిత్యంపై బాధితురాలి కుమారుడు మాట్లాడుతూ.. రాఖీ కట్టేందుకు తన తల్లి ఆటోలో వెళ్తుంటే అటవీ ప్రాంతానికి తీసుకువెళ్లి దాడి చేశారని వివరించాడు. హత్యాచార యత్నం చేయడంతో, తన తల్లి ప్రతిఘటించిందని.. దీంతో ఆమెకు గాయాలు అయ్యాయని తెలిపాడు. ఈ ఘటనపై హరీష్ రావు మాట్లాడుతూ.. జైనూర్ ఘటన అత్యంత పాశవికంగా జరిగిందన్నారు. ఈ మధ్య కాలంలో తరుచుగా ఇటువంటి ఘటనలు అనేకం చోటుచేసుకుంటున్నాయన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత 1900 అత్యాచారం కేసులు నమోదు అయ్యాయన్నారు. మా ప్రజాప్రతినిధులు అసెంబ్లీలో మాట్లాడితే... స్పందన లేదన్నారు. ఆ మరుసటి రోజు మరొక ఘటన చోటుచేసుకుందన్నారు. హైద్రాబాద్ అంటే ఒకప్పుడు మతకలహాలు జరుగుతాయని అనేవారని... అప్పట్లో కేసీఆర్ లా అండ్ ఆర్డర్‌నీ అదుపులోకి తెచ్చారన్నారు. కానీ ఇప్పుడు అస్తవ్యస్తం అయ్యిందన్నారు.



**ముఖ్యమంత్రికి సమయం లేదా? :** దేశంలో అనేక సంస్థలు ఇక్కడ క్రైమ్ రెట్ తక్కువ అని ప్రశంసించారన్నారు. ఇప్పుడు హైద్రాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ని దెబ్బతీస్తున్నారన్నారు. కేసీఆర్ అద్భుతంగా పరిపాలించారని హరీష్ రావు కొనియాడారు. అసలు ఈ రాష్ట్రం లో ఏం జరుగుతోందని ప్రశ్నించారు. యువకుల చేతుల్లో తుపాకులు పెరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో తుపాకులు రాజ్యమేలుతున్నాయని.. ఈ 9 నెలల్లో నాటు తుపాకులు ఇప్పటికే వందల సంఖ్యలో దొరికాయన్నారు. కొత్త డీజీపీ వచ్చిన తరువాత మతకలహాలు జరుగుతున్నాయన్నారు. మెదక్‌లో లా అండ్ ఆర్డర్‌లో ఫెయిల్ అయిన తరువాత ఒక అధికారిని తీసుకుని వచ్చి హైదరాబాద్‌లో మంచి స్థానంలో అపాయింట్ చేశారన్నారు. డయల్100 కూడా పనిచెయ్యడం లేదని.. పోలీసులను సైతం పని చెయ్యనియ్యడం లేదన్నారు. వారిని ఇతర కార్యక్రమాలకు వాడుతున్నారని హరీష్ రావు అన్నారు. సీఎం రేవంత్ వరద విపత్తు సహాయం చెయ్యడంలో విఫలం అయ్యారని విమర్శించారు. రోజు అత్యాచారాలు, ప్రతిపక్షాలను వేధించడం... ఇవే కనిపిస్తున్నాయన్నారు. నిన్న ఎన్‌కౌంటర్ జరిగిందని.. కేసీఆర్ హయంలో ఒక్క ఎన్‌కౌంటర్ కూడా జరగలేదని.. కాంగ్రెస్ వచ్చిందని హరీష్ రావు పేర్కొన్నారు. జైనూర్ ఘటన పై ప్రభుత్వం స్పందించాలన్నారు. గిరిజన మహిళపై అత్యాచార యత్నం జరిగితే పరామర్శించడానికి ముఖ్యమంత్రికి సమయం లేదా? అని ప్రశ్నించారు. వెంటనే ఆమెకు 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

# కేసీఆర్‌కు మరోసారి కోర్టు సమన్లు

హైదరాబాద్: మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మరోసారి కోర్టు సమన్లు జారీ చేసింది. మేడిగడ్డ బ్యారేజీ వ్యవహారంలో ఈ నెల 17న.. విచారణకు హాజరుకావాలని భూపాలపల్లి జిల్లా కోర్టు సమన్లు జారీ చేయడం జరిగింది. కేసీఆర్ సహా ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్‌కూ కోర్టు సమన్లు జారీ చేసింది. బ్యారేజీ కుంగిపోవడంతో కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగమైందని.. ఈ అంశంపై విచారణ చేయాలని ఓ వ్యక్తి కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు సమన్లు జారీ చేసింది. భూపాలపల్లికి చెందిన రాజలింగమూర్తి అనే వ్యక్తి మేడిగడ్డ వ్యవహారంపై కోర్టును ఆశ్రయించారు. రాజలింగమూర్తి పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న జిల్లా జడ్జి.. పిటిషనర్ కోరిన విధంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు 8 మందికి ఆగస్టు మొదటి వారంలో నోటీసులు జారీ చేశారు. ఆ నోటీసుల్లో సెప్టెంబర్ 5న భూపాలపల్లి జిల్లా కోర్టుకు హాజరుకావాలని వారందరికీ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో గురువారం కేసు విచారణకు వచ్చింది. అయితే కోర్టుకు నిన్న హరీశ్‌రావు తరఫున న్యాయవాదులు లలితా రెడ్డి, సుకన్య.. కాంట్రాక్ట్ సంస్థ మేఘా కృష్ణారెడ్డి, ఇరిగేషన్ మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్ కుమార్, ఎల్ అండ్ టీ ఎండీ సురేశ్ కుమార్ తరఫున సుప్రీంకోర్టు అడ్వకేట్లు అవధాని, శ్రావణ్ రావు.. ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజినీర్లు హరిరామ్, శ్రీధర్ తరఫున వరంగల్ అడ్వకేట్ నరసింహారెడ్డి హాజరయ్యారు. అయితే కేసీఆర్, సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్? తరఫున మాత్రం న్యాయవాదులెవ్వరూ కోర్టుకు హాజరుకాలేదు. దీంతో ఈ కేసును వచ్చే నెల 17కు జిల్లా జడ్జి నారాయణబాబు వాయిదా వేశారు.

# 9 నెలల కాంగ్రెస్ పాలనలో మహిళలపై 1900 లైంగికదాడులు: హరీశ రావు

హైదరాబాద్: రాష్ట్రంలో హత్యాచారాలు నిత్యకృత్యమయ్యాయని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. తొమ్మిది నెలల కాంగ్రెస్ పాలనలో మహిళలపై 1900 లైంగికదాడులు జరిగాయని చెప్పారు. ముఖ్యమంత్రి వద్దే హోం శాఖ ఉన్నప్పటికీ.. ప్రతి రోజూ 2 హత్యలు, 4 మానభంగాలు అన్నట్టుగా పరిస్థితి తయారయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు నేతృత్వంలోని తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే కోవా లక్ష్మి, ముఠా గోపాల్‌తో కూడిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే బృందం హైదరాబాద్ గాంధీ దవాఖానలో చికిత్స పొందుతున్న ఆదివాసీ మహిళను పరామర్శించింది. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో మహిళలకు భద్రత కరువైందన్నారు. బాధితురాలికి రూ. 10 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో మహిళల రక్షణకు షీ టీమ్స్ ఏర్పాటు చేశామన్నారు. గత పదేండ్లు తెలంగాణను కేసీఆర్ అద్భుతంగా పరిపాలించారు. శాతిభద్రతలను పటిష్టంగా అమలు చేశారు. ఇప్పుడు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రతిష్ఠ మసకబారుతున్నదని చెప్పారు. స్మగుల్డ్ వెపన్స్ బయటపడుతున్నాయి. ఒకప్పుడు బీహార్‌లో ఉండే నాటు తుపాకులు.. తెలంగాణలో రాజ్యమేలుతున్నాయి. కేంద్ర హోంశాఖ జోక్యం చేసుకుని రాష్ట్రంలో రక్షణ వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. పోలీసులను ప్రభుత్వం పనిచేయనీయట్లేదన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఫేక్ ఎన్‌కౌంటర్లు చేస్తున్నదని ఆరోపించారు. వరద విపత్తు సహాయం అందించడంలో, లా అండ్ ఆర్డర్, రుణమాఫీ, విద్యా వ్యవస్థను నడిపించడంలో ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. మొత్తానికి ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఫెయిల్ అయ్యాడని విమర్శించారు. ఎంత సేపూ ప్రతిపక్షాలను వేధించడం, అక్రమ కేసులు పెట్టడం తప్ప పాలనను గాలికి వదిలేశాడన్నారు.




దిల్లీ: హరియాణా ఎన్నికల వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, బజరంగ్ పునియా కాంగ్రెస్ పార్టీలో చేరారు. దిల్లీలో పార్టీ ప్రధాన కార్యాలయంలో సీనియర్ నేతల సమక్షంలో వీరిద్దరూ హస్తం కండువా వేసుకున్నారు. దీనికి ముందు ఈ రెజ్లర్లు అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసానికి వెళ్లి ఆయనను కలిశారు. మరోవైపు, పార్టీలో చేరడానికంటే ముందే.. భారత రైల్వేలో తమ ఉద్యోగాలకు వినేశ్, పునియా రాజీనామా చేశారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ ఇటీవల భేటీ అయ్యింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై చర్చ జరిపిందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

ఈ నేపథ్యంలోనే రెండు రోజుల క్రితం వినేశ్ ఫొగాట్, బజ్‌రంగ్ పునియా. కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. ఆ ఫొటోను కాంగ్రెస్ పార్టీ తమ 'ఎక్స్' ఖాతాలో షేర్ చేసింది. దాంతో వారు కాంగ్రెస్‌లో చేరడం దాదాపు ఖాయమంటూ వచ్చిన వార్తలు.. తాజాగా నిజమయ్యాయి. ఇదిలాఉంటే.. నేడో, రేపో కాంగ్రెస్ అభ్యర్థుల జాబితాను విడుదల చేసే అవకాశాలున్నాయి. అందులో వీరికి టికెట్లు దక్కే సంకేతాలు కన్పిస్తున్నాయి. అధిక బరువు కారణంగా అనర్హత వేటు పడటంతో స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ఒలింపిక్స్ కల చెదిరింది. దాంతో ఆమె భవిష్యత్తు ప్రయాణంపై సర్వత్రా ఆసక్తి నెలకొన్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఇటీవల ఆమె ఒలింపిక్స్ ముగించుకొని స్వదేశానికి చేరుకున్న సమయంలో.. ఎయిర్‌పోర్టు వద్ద కాంగ్రెస్ ఎంపీ దీపిందర్ హుడా ఆమెకు స్వాగతం పలికారు. అంతకుముందు కూడా వినేశ్‌ను రాజ్యసభకు పంపాలంటూ కొంతమంది కాంగ్రెస్ నేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు. భారత రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై పలువురు మహిళా రెజ్లర్లు లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఆ క్రమంలో జరిగిన ఆందోళనల్లో వినేశ్, పునియా కీలకంగా వ్యవహరించారు. గత హరియాణా అసెంబ్లీ ఎన్నికలకు ముందు వినేశ్ సోదరి బబితా 2019లో భాజపాలో చేరిన సంగతి తెలిసిందే. ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో దాద్రి స్థానం నుంచి పోటీ చేసిన ఆమె.. ఓటమి పాలయ్యారు. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి ఆమెకు కమలం పార్టీ టికెట్ ఇవ్వనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఇప్పుడు అదే స్థానం నుంచి వినేశ్‌ను దించాలని కాంగ్రెస్ ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం. ఇదే నిజమైతే ఈసారి హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఫొగాట్ సిస్టర్స్ పోరు దేశవ్యాప్తంగా ఆసక్తికరంగా మారనుంది. ఈ రాష్ట్రంలో అక్టోబరు 5న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 8న ఫలితాలు వెల్లడికానున్నాయి.

# భారీ వర్షాలతో తెలంగాణ ఏ రేంజ్‌లో నష్టం జరిగిందంటే?

హైదరాబాద్, సెప్టెంబర్ 6: భారీ వర్షాలు తెలంగాణను ముంచెత్తాయి. కుండపోత వర్షాలకు రాష్ట్రంలోని పలు జిల్లాలు వరద ముంపునకు గురయ్యాయి. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. అనేక ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. ముంపు ప్రాంతాల్లో ప్రజల పరిస్థితి వర్ణణాతీతం. వరదలకు ఎంతో మంది ప్రాణాలు కూడా కోల్పోయారు. పంటల పొలాలు నీటమునిగి తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా భారీగా నష్టం వాటిల్లింది. గడిచిన వారం రోజుల క్రితం కురిసిన వర్షానికి ఉమ్మడి ఖమ్మం , నల్గొండ, వరంగల్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో భారీగా పంట నష్టం జరిగింది. వర్షాల కారణంగా ఇరవై మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. వర్షాలు, వరదకు వరద బాధితులు సర్వం కోల్పోయిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పుటికే వరద వల్ల చనిపోయిన కుటుంబాలకు ఐదు లక్షల ఎక్స్ గ్రేషియాతో పాటు పంటకు పది వేల ఆర్థిక సహాయం ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలని ఈనెల 1న మోడీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. ఇవాళ రాష్ట్రానికి కేంద్ర మంత్రులు శివ రాజ్ సింగ్ చౌహాన్,



బండి సంజయ్‌లు రానున్నారు. ఉదయం ఖమ్మం జిల్లాలో కేంద్రమంత్రులు పర్యటించనున్నారు. నేరుగా వరద బాధితులతో ముఖాముఖీ నిర్వహించనున్నారు. మధ్యాహ్నం తరువాత సచివాలయంలో ముఖ్యమంత్రితో రేవంత్‌తో కేంద్ర మంత్రులు భేటీ అవుతారు. వరదల వల్ల దాదాపు వేల కోట్ల వరకు నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనాకు వచ్చింది.




# బీఆర్ఎస్‌లో విషాదం.. తెలంగాణ ఉద్యమకారుడు జిట్టా కన్నుమూత

హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీలో విషాదం నిండింది. తెలంగాణ ఉద్యమకారుడు జిట్టా బాలకృష్ణ రెడ్డి శుక్రవారం మరణించారు. ఆయన బ్రెయిన్ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతూ 2 నెలలకుపైగా హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించి ఇవాళ ఉదయం ప్రాణాలు విడిచారు. జిట్టా మరణ విషయాన్ని కుటుంబ సభ్యులు నిర్ధారించారు. ఆయన స్వగ్రామమైన భువనగిరికి బాలకృష్ణారెడ్డి పార్థివ దేహాన్ని తరలిస్తున్నారు. ఇవాళ సాయంత్రం లేదా రేపు ఆయన అంతక్రియలు జరగనున్నాయి. ఉద్యమకారుడి మృతి పట్ల గులాబీ నేతలు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

**రాజకీయ జీవితం..** తెలంగాణ ఉద్యమకారుడిగా గుర్తింపు పొందిన జిట్టా తెలంగాణ రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) ఆవిర్భావం తరువాత ఆ పార్టీలో చేరారు. టికెట్ రాకపోవడంతో కాంగ్రెస్‌లో చేరిన ఆయన వైఎస్ మరణానంతరం వైసీపీలో చేరారు. ఆ తరువాత యువ తెలంగాణ పార్టీ స్థాపించారు. తరువాత మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు. చివరికి సొంత గూటికి(బీఆర్ఎస్)కి చేరుకున్నారు.

**జిట్టా బాలకృష్ణారెడ్డి మృతిపట్ల కేటీఆర్ సంతాపం :** జిట్టా బాలకృష్ణారెడ్డి మృతి పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం తెలిపారు. ఆయన మరణవార్త దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఎంతో క్రియాశీలకంగా వ్యవహరించి, కేసీఆర్ వెంటనడిచిన వ్యక్తుల్లో జిట్టా ఒకరని చెప్పారు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సొంత ఆస్తులను కూడా లెక్క చేయకుండా ఉద్యమ నిర్మాణానికి తన వంతు కృషి చేశారని చెప్పారు. జిట్టా లాంటి నాయకుడిని కోల్పోవడం బీఆర్ఎస్‌కు తీరని లోటన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేరాలన్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, శ్రేయోభిలాషులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**జిట్టా బాలకృష్ణారెడ్డి అకాల మరణం పట్ల సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి :** తెలంగాణ ఉద్యమకారుడు జిట్టా బాలకృష్ణారెడ్డి అకాల మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మంచి మిత్రుడిని, సన్నిహితుడిని కోల్పోయానని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. యువతను ఐక్యం చేసి తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నాయకుడు జిట్టా అని సీఎం అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడ్ని ప్రార్థిస్తూ వారి కుటుంబసభ్యులకు సీఎం ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు.

# జూబ్లీహిల్స్‌లో పెద్ద ఎత్తున విస్కీ ఐస్‌క్రీమ్ అమ్మకాలు..

హైదరాబాద్: ఐస్‌క్రీమ్ అంటే ఇష్టపడని పిల్లలు ఎవరుంటారు? అయితే బయట మార్కెట్‌లో రకరకాల ఫ్లేవర్స్ అందుబాటులో ఉంటున్నాయి. పిల్లలు తమకు ఇష్టమైన ఫ్లేవర్‌ను ఎంచుకుని ఇష్టంగా లాగించేస్తూ ఉంటారు. అయితే జూబ్లీహిల్స్‌లోని వన్ అండ్ ఫైవ్ ఐస్?క్రీమ్ పార్లర్?లో ఐస్‌క్రీమ్‌లను మాత్రం పిల్లలు తెగ ఇష్టంగా తింటున్నారట. రేటు ఎక్కువ ఉన్నా కూడా వెనుకాడకుండా తింటున్నారు. కారణం ఇక్కడ విస్కీని ఉపయోగించి తయారు చేసిన ఐస్‌క్రీమ్‌లే. ఇవేంటో కూడా తెలియని చిన్నారులు ఈ ఐస్‌క్రీమ్ పట్ల ఆకర్షితులవుతున్నాయి. భావితరాలను డ్రగ్స్ గంజాయి లాంటి మత్తు పదార్థాలు పీడిస్తున్నాయి. చివరకు పసి మొగ్గలుగా పెరిగి పెద్దగా ఎదిగే చిన్నపిల్లలు ఎంతో ఇష్టపడే ఐస్ క్రీమ్ లో ఏకంగా 100 పేపర్ విస్కీ కలిపి ఆకాశాన్ని అంటే ధరలతో అమ్మకాలు జరిపి సొమ్ము చేసుకుంటున్న ఐస్ క్రీమ్ పార్లర్ ప్రబుద్ధుల తీరును ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు బయటపెట్టారు. ఇవాళ పిల్లల ఐస్?క్రీమ్?లో విస్కీ కలిపి అమ్ముతున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. వన్ అండ్ ఫైవ్ ఐస్?క్రీమ్ పార్లర్?లో ఎక్సైజ్ అధికారులు సోదాలు నిర్వహించారు. ఐస్?క్రీమ్?లో పేపర్ విస్కీ కలిపి వన్ అండ్ ఫైవ్ యజమాని అమ్ముతున్నాడు. 60 గ్రాముల ఐస్?క్రీమ్?లో 100 మి.లీ విస్కీ కలుపుతున్నారు. ఐస్?క్రీమ్? క్రీమ్ విస్కీ కోసం పిల్లలు, యువత ఎగబడుతున్నారు. మరింత అమ్మకాలు పెంచుకునేందుకు మరో అడుగు ముందుకు వేసిన ఐస్ క్రీమ్ తయారీదారులు ఫేస్ బుక్‌లో ఒక యాడ్ కూడా ఇచ్చి తమ అమ్మకాల్ని జోరు అందుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. వన్ అండ్ ఫైవ్ ఐస్?క్రీమ్ పార్లర్ యజమానులు దయాకర్ రెడ్డి, శోభన్‌లను జూబ్లీహిల్స్‌లో ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. 11.5 కేజీల విస్కీ ఐస్ క్రీమ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 1లో ఈ ఐస్‌క్రీమ్ పార్లర్ ఉంది. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్టీఎఫ్ టీం లీడర్ ప్రదీప్ రావు బృందం ఈ ఐస్‌క్రీములను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com